ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 13 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 257 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: చతుర్ది - 20:44:09 వరకు నక్షత్రంమూల - 17:17:38 వరకు కరణంవణిజ - 07:25:49 వరకు, విష్టి - 20:44:09 వరకు పక్షంశుక్ల యోగంధృతి - 29:22:30 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

తమిళనాడులో భారీ చోరీ కలకలం

తనిష్క్ జ్వలరీస్‌లో భారీ చోరీ..

50కోట్ల విలువైన నగలు మాయం!

16 కిలోల బంగారు ఆభరణాలు చోరీ

మదురై, నవంబర్ 12(ప్రజాజ్యోతి): తమిళనాడులో వాణిజ్య సంస్థలు, నగల దుకాణాలే లక్ష్యంగా వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా మదురైలోని టాటా గ్రూప్‌కు చెందిన ప్రముఖ తనిష్క్

మిగతా 2లో..

వీసీ అల్దాస్ జానయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 12(ప్రజాజ్యోతి): మహిళా ప్రొఫెసర్లపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య వేధింపుల వ్యవహారం చర్చనీయాంశంగా మారిందని తెలిసిందే. వీసీ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే తోటి ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు

మిగతా 2లో..



రెండో విడత సమ్మిట్‌కు సర్వం సిద్ధం

నేటినుండి హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్..

సమ్మిట్ కు 70 దేశాల ప్రతినిధుల రాక



హైదరాబాద్, నవంబర్ 12: తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ స్థాయి మేధోమథనానికి, దౌత్య చర్చలకు ప్రధాన వేదిక కానుంది. నవంబర్ 13, 14 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెండో విడత భారత్ సమ్మిట్ కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 దేశాలకు చెందిన ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ప్రతినిధులు హాజరుకానుండటంతో జాతీయ స్థాయిలో రాజకీయ ఆసక్తి నెలకొంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, అంతర్జాతీయ అభివృద్ధి మరియు సమకాలీన

మిగతా 2లో..



హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ విస్తరణ..

జెన్‌పాక్ట్‌తో మార్స్ కీలక భాగస్వామ్యం

ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 12: హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన

మిగతా 2లో..

డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి ప్రారంభం

జూన్ 2 నాటికి అందుబాటులోకి అన్ని టిమ్స్‌లు

మూడు టిమ్స్‌లకు ఒకేసారి నియామకాలు చేపట్టాలి

నిమ్స్,టిమ్స్ ఆస్పత్రి మధ్య సమన్వయం ఉండాలి

అధికారులను ఆదేశించిన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి

ఆరోగ్యశాఖపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 12(ప్రజాజ్యోతి): జూన్ 2 నాటికి అన్ని టిమ్స్‌లు అందుబాటులోకి రావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ వరకు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తికావాలని సూచించారు. మూడు టిమ్స్‌లకు ఒకేసారి నియామకాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వాటి ఉద్యోగుల బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. టిమ్స్ హౌస్ కీపింగ్‌ను పూర్తిగా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలన్నారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలని సూచించారు. నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్ లో డాక్టర్ల నియామకమయ్యే వరకు బయట నుంచి నియమించుకోవాలని అధికారులకు సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంపు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానంలో చేపట్టాలని ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా 3 టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా

మిగతా 12లో..

హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్..

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

21 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం

ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ..

హైదరాబాద్, నవంబర్ 12(ప్రజాజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖలో రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రక్షాళన చేపట్టింది. ఏకంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యంత కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఏసీబీ డీజీ, ఆర్టీసీ ఎండీ, సివిల్ సప్లైస్ కమిషనర్ వంటి ముఖ్య స్థానాల్లో మార్పులు జరిగాయి. హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ భగవత్ నియమితులు కాగా ప్రస్తుత సీపీ వీసీ సజ్జనార్‌ను ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా ప్రభుత్వం బదిలీ చేసింది. సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీటీమ్స్, భరోసా డీజీపీగా

మిగతా 12లో..



అమెరికాలో మరోసారి కాల్పులు

వైట్‌హౌస్ సమీపంలో గన్ ఫైర్

ఘటనలో నలుగురు మృతి!?

వీధులను దిగ్బంధించిన పోలీసులు

వాషింగ్టన్ డీసీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ దుండగుడు జనాలపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు.. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ సహాయంతో హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చరీకి పంపారు. మరోవైపు

మిగతా 2లో..

కేజ్రీవాల్ కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

7 కోట్లు ఇవ్వకపోతే చంపేస్తామంటూ వార్నింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌కు ప్రాణహాని బెదిరింపులు వచ్చాయి. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. తమకు రూ.7 కోట్లు ఇవ్వాలని, లేనిపక్షంలో కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తెను హతమారుస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఢిల్లీలోని తిలక్ నగర్ ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ వెల్లడించారు. తన ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్, వాట్సాప్ సందేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. విదేశాల్లో సంబంధాలు ఉన్న

మిగతా 2లో..

వ్యవసాయ ఆధునీకరణతోనే 'వికసిత్ భారత్'

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు..

అంతకంటే ముందే వికసిత భారత్ ఫలాలు

భారతీయ రైతులలో నిజంగా అపార సామర్థ్యం

నిత్యావసరాల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానం

చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే ముందంజ

భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలి

మీడియాకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): 'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా,

మిగతా 12లో..



ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ రాజీనామా

ప్రెసిడెంట్, బోర్డు సభ్యత్వానికి కూడా రిజైన్

తాత్కాలిక చీఫ్‌గా కొలెట్ క్రెస్ నియామకం!

పూర్తిస్థాయి కొత్త సీఈఓ ఎంపికపై కసరత్తు

యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ను నియమించే ఛాన్స్

న్యూఢిల్లీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): చైనా స్పైగా అనుమానిస్తున్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. సీఈఓ, ప్రెసిడెంట్ సహా బోర్డు సభ్యత్వానికి కూడా

మిగతా 12లో..



22ఏ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

యుద్ధప్రాతిపదికన పరీష్కరించాలి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 12(ప్రజాజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఏ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఆ దిశగా సర్కారు తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తున్నట్లు వివరించారు. 22ఏ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు పరిష్కారంలో

మిగతా 2లో..

మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ

ఇకపై ఇంటి వద్దకే మీ-సేవ సర్వీసులు

1100 నంబర్‌కు కాల్ చేస్తే ఏజెంట్లే ఇంటికి

హైదరాబాద్, నవంబర్ 12(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగర ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో ' మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ ' (డీఎస్‌డీ) సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది.

మిగతా 2లో..





సుందర్ పిచాయ్ బిజినెస్ లీడర్

హరూన్ గ్లోబల్ ఇండియన్స్ జాబితాలో టాప్

సత్య నాదెళ్లను వెనక్కినెట్టిన సుందర్ పిచాయ్

రెండో స్థానంతో సరిపెట్టుకున్న సత్య నాదెళ్ల..

మూడో స్థానంలో సంజయ్ మెహ్రోత్రా..

న్యూఢిల్లీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): ప్రపంచ కార్పొరేట్ వేదికపై భారత సంతతి వ్యాపార దిగ్గజాలు తమ తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక 'హెచ్ఎన్‌బీసీ హరూన్ గ్లోబల్ ఇండియన్స్ లిస్ట్ 2026' ప్రకారం.. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) సుందర్ పిచాయ్ అత్యంత ప్రభావవంతమైన భారత సంతతి బిజినెస్ లీడర్‌గా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆయన నేతృత్వంలోని ఆల్ఫాబెట్ సంస్థ ప్రస్తుత మార్కెట్ విలువ ఏకంగా రూ. 365.4 లక్షల కోట్లకు (4.2 ట్రిలియన్ డాలర్లు) చేరుకుంది. ఈ జాబితాలో మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల రెండో స్థానంలో నిలవగా, ప్రముఖ సెమీకండక్టర్ తయారీ సంస్థ 'మైక్రాన్ టెక్నాలజీ' సీఈవో సంజయ్ మెహ్రోత్రా మూడో స్థానాన్ని

మిగతా 2లో..

సంపాదకీయం

భారత్ పై బంగ్లా ఒత్తిడి!?

దాదాపు రెండున్నరేళ్ల క్రితం బంగ్లాదేశ్ లో విద్యార్థుల నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు విఫలయత్నం చేసి పదవీచ్యుతురాలైన మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్ కు పారిపోయి వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. గతంలో భారత్ తో సఖ్యతగా వ్యవహరించిన కారణంతో న్యూఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో ఆమెకు ప్రభుత్వం శరణార్థిగా ఆశ్రయం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో స్వదేశంలో తన పార్టీ తుడిచిపెట్టుకుపోవడం, మరోవైపు విద్యార్థుల హత్యలకు ఆదేశాలు ఇచ్చిన వ్యవహారంలో బంగ్లా ట్రిబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించడం కూడా జరిగిపోయాయి. అలాగే భారత్ తో ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందం ప్రకారం ఆమెను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం కోరుతోంది. అయినా భారత్ మాత్రం స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో తిరిగి స్వదేశానికి వెళ్లి పార్టీని కాపాడుకోవడం, దేశ రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ గా మారే లక్ష్యంతో షేక్ హసీనా ఈ డిసెంబర్ లో బంగ్లాదేశ్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే నేరుగా వెళ్లినా ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉంది. అలా కాకుండా మాజీ ప్రధాని హోదాలో దౌత్య పాస్ పోర్టు తీసుకుని, స్వదేశంలో అధికారిక హోదాలో అడుగుపెట్టేందుకు హసీనా ప్లాన్ చేసుకున్నారు. ఈ మేరకు లండన్ లోని తన లీగల్ టీమ్ ద్వారా న్యూఢిల్లీలోని బంగ్లా ఎంబసీకి కొత్త పాస్ పోర్టుకు దరఖాస్తు చేస్తూ లేఖ రాశారు. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. షేక్ హసీనా కొత్త పాస్ పోర్టు కోసం చేసుకున్న దరఖాస్తును బంగ్లాదేశ్ ప్రభుత్వం తోసిపుచ్చింది. హసీనాకు పాస్ పోర్టు అవసరం లేదని, ఆమె సాధారణ ప్రయాణికురాలిగా బంగ్లాదేశ్ కు తిరిగి రావచ్చని విదేశాంగమంత్రి హుమాయున్ కబీర్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ ద్వారా మరణశిక్ష విధించిన, ఢాకా ప్రభుత్వం పరారీలో ఉన్న నేరస్థురాలిగా పరిగణిస్తున్న షేక్ హసీనాకు కొత్త పాస్‌పోర్ట్ జారీ చేసే ప్రశ్నే తలెత్తదని ఆయన తేల్చిచెప్పేశారు. కాబట్టి భారత్–బంగ్లాదేశ్ మధ్య ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని ఆయన మరోసారి డిమాండ్ చేసారు. ఆమె తిరిగి రావాలంటే, కొత్త ప్రయాణ పత్రాలను జారీ చేయడం ద్వారా కాకుండా, ఇప్పటికే ఉన్న చట్టపరమైన నిబంధనల ప్రక్రియ ద్వారానే జరగాలని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. దీంతో పాస్ పోర్టు తీసుకుని రాచమార్గంలో స్వదేశానికి వెళ్లాలనుకున్న షేక్ హసీనా కోరిక నెరవేరలేదు. అయితే కొత్త పాస్‌పోర్ట్ కోసం మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా చేసుకున్న దరఖాస్తును బంగ్లాదేశ్ ప్రభుత్వం సోమవారం తిరస్కరించింది. ఆమె కొత్త పాస్‌పోర్ట్ కోరడాన్ని ఒక 'డ్రామా' అంటూ బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ కొట్టిపారేశారు. ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ ప్రభుత్వం పాస్‌పోర్ట్‌లు జారీ చేయదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఆమెను వెంటనే బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను కోరారు. ఆగస్టు 2024లో బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చిన హసీనా.. గత రెండున్నరేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. "ఆమె దేశం విడిచి పారిపోయారు... ఇప్పుడు కొత్త పాస్‌పోర్ట్‌తో తిరిగి రావడం గురించి ఇలాంటి నాటకాలు ఆడటానికి ఎలాంటి ఆస్కారం లేదు. ఆమె నిజంగానే దేశానికి తిరిగి రావాలనుకుంటే, దానికి నిర్దిష్టమైన న్యాయపరమైన ప్రక్రియ ఉంది. బంగ్లాదేశ్, భారత్ మధ్య అప్పగింత ఒప్పందం ఉంది. ఆ ఒప్పందం కింద తనను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని ఆమె భారత ప్రభుత్వాన్ని కోరవచ్చు. అప్పుడు ఆమె తిరిగి వచ్చి, కోర్టు ముందు లొంగిపోయి తన శిక్షను అనుభవించవచ్చు" అని కబీర్ పేర్కొన్నారు. తనను అరెస్టు చేసి ఉరితీస్తారనే ఆందోళనలు ఉన్నప్పటికీ, వచ్చే నెలలో బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానని హసీనా ప్రకటనలు గుప్పిస్తున్న నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ వ్యాఖ్యలు చేసింది. 2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో చెలరేగిన తీవ్ర నిరసనలు, విద్యార్థి ఉద్యమం హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేశాయి. నిరసనకారులు ప్రధాని అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో ఆమె దేశం విడిచి భారత్‌కు పారిపోయారు. 2024 జులై–ఆగస్టు మధ్య జరిగిన ఉద్యమంలో వందలాది మంది మరణానికి, వేలాది మంది గాయపడటానికి ఆమె ఇచ్చిన ఆదేశాలే కారణమని పేర్కొంటూ, బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ 2025లో హసీనాకు మరణశిక్ష ఖరారు చేసింది. పరారీలో ఉన్న నేరస్థుల నుంచి వచ్చే ఎలాంటి పాస్‌పోర్ట్ దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించదని కబీర్ స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం దౌత్య, న్యాయపరమైన మార్గాల ద్వారానే హసీనాను బంగ్లాదేశ్‌కు తీసుకువచ్చి విచారణ జరుపుతామని చెప్పారు. అంతకుముందు, లండన్‌కు చెందిన తన లాయర్ల ద్వారా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు హసీనా పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రాయిటర్స్ నివేదించింది. 2024లోనే ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆమె పాస్‌పోర్ట్‌ను రద్దు చేసింది. 'హసీనా పాస్‌పోర్ట్, ఎన్ఐడీ కార్డును తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసినందున, మా క్లయింట్‌కు కొత్త పాస్‌పోర్ట్, ఎన్ఐడీ కార్డు జారీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం" అని లండన్‌కు చెందిన మ్యాట్రిక్స్ ఛాంబర్స్ లాయర్లు బంగ్లాదేశ్ హైకమిషన్‌కు లేఖ రాశారు. అయితే, సదరు న్యాయ సంస్థ పంపి ఈ–మెయిల్‌లో హసీనా సంతకం గానీ, అధికారిక పత్రాలు గానీ లేకపోవడంతో ఆ దరఖాస్తు హసీనా తరఫున వచ్చినట్టు ధ్రువీకరించలేమని బంగ్లాదేశ్ ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏది ఏమైనా భారత్ పై నిందలు వేయకుండా హసీనాను బంగ్లాదేశ్ కు రప్పించే ప్రయత్నాలు సాగాలని నిపుణులు కోరుకుంటున్నారు.

మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ

మొదటిపేజీ తరువాయి..

ఇకపై ఎంపిక చేసిన ప్రాంతాల్లో నివసించే ప్రజలు వివిధ ప్రభుత్వ సేవల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. శిక్షణ పొందిన, ధ్రువీకరించిన ఏజెంట్ల ద్వారా ఇంటి నుంచే సేవలను పొందే అవకాశం కల్పిస్తోంది. అయితే ఈ సదుపాయం ప్రస్తుతం నగరమంతటా అందుబాటులోకి రాలేదు. దశలవారీగా మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నారు. గురువారం రోజున గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన పౌర సౌకర్యాల కార్యక్రమంలో ఈ డీఎస్‌డీ సేవపై అవగాహన కల్పించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు డిజిటల్ సేవల వినియోగాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉన్న ప్రాంతాల ప్రజలు రెండు మార్గాల్లో సేవలను కోరవచ్చు. ఫోన్ ద్వారా సేవ పొందాలనుకునేవారు 1100 నంబర్‌కు కాల్ చేసి.. ఆ తర్వాత 1 నంబర్ నొక్కాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలనుకునేవారు ప్రత్యేక పోర్టల్‌ను సందర్శించవచ్చు. ఈ మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ సదుపాయం గురించి ఎక్కువ మందికి తెలియజేసేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషించాలని అధికారులు సూచించారు. అపార్ట్‌మెంట్లు, నివాస సముదాయాల్లోని వాట్సాప్ గ్రూపుల ద్వారా సేవల వివరాలను పంచుకోవాలని కోరారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యక్ష ప్రదర్శనలు, హెల్ప్‌డెస్క్‌లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ శాఖలు, నివాస సముదాయాల మధ్య అనుసంధానాన్ని పెంచాలని సంబంధిత అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డిజిటల్ ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు.. ఇంటి వద్ద నుంచే ప్రభుత్వ సేవలను పొందే అవకాశాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ అందుబాటులో ఉంది. ఈ సదుపాయం తమ నివాస ప్రాంతం పరిధిలో ఈ సేవ ఉందో లేదో ముందుగా ఫోన్, అధికారిక పోర్టల్ ద్వారా తెలుసుకోవాలి. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలకు వెళ్లేందుకు వెచ్చించే సమయాన్ని తగ్గించడం, సేవలను మరింత సౌకర్యవంతంగా అందించడం ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలు అని అధికారులు పేర్కొన్నారు. ఈ సదుపాయం మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తే నగరంలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు పొందడం మరింత సులభం కానుంది.



రెండో విడత సమ్మిట్‌కు

సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

భౌగోళిక రాజకీయ అంశాలపై లోతైన చర్చలు జరిపేందుకు ఈ సదస్సు ఒక కీలక వేదికగా నిలవనుంది.

ఈ అంతర్జాతీయ సదస్సు విషయంలో అందరి దృష్టి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపైనే కేంద్రీకృతమైంది. ఈ సమ్మిట్‌కు రాహుల్ గాంధీ హాజరవుతారా? ఒకవేళ ఆయన పర్యటన ఖరారైతే సదస్సులో ఎలాంటి అంశాలపై ప్రసంగిస్తారు? అలాగే రాష్ట్ర నేతలతో ఏమైనా ప్రత్యేక భేటీలు నిర్వహిస్తారా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. రాహుల్ రాకపై అధికారిక షెడ్యూల్‌పై స్పష్టత రావాల్సి ఉన్నప్పటికీ, ఆయన పర్యటన ఖరారైతే తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరియడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, భారత్ సమ్మిట్ వేదికను కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయ స్థాయిలో తన సిద్ధాంతాలను, ప్రగతిశీల విధానాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు వినియోగించుకుంటుందన్న చర్చ జరుగుతోంది. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, మేధావులతో జరిగే ముఖాముఖి సమావేశాలు, చర్చాగోష్ఠుల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య విలువలు, భారత విదేశాంగ దృక్పథంపై కాంగ్రెస్ తన గళాన్ని బలంగా వినిపించే అవకాశం ఉంది. అదే సమయంలో, తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, తెలంగాణను ప్రపంచ స్థాయి మేధో చర్చలకు, పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రబిందువుగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది. నవంబర్ 13, 14 జరగబోయే ఈ రెండు రోజుల 'భారత్ సమ్మిట్'పై దేశ రాజకీయ, దౌత్య వర్గాల దృష్టి నిలిచింది. రాహుల్ గాంధీ రాకపై వీడనున్న ఉత్కంఠ, 70 దేశాల ప్రతినిధుల సమక్షంలో ఈ అంతర్జాతీయ వేదికపై కాంగ్రెస్ నాయకత్వం ఇవ్వబోయే సందేశం రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

అయితే, ఈ వేదికపై సీనియర్ కాంగ్రెస్ నేతలు చేసిన సంచలన వ్యాఖ్యలు, ఏఐసీసీ అగ్రనేతల భాగస్వామ్యం చూస్తుంటే.. ఇది కేవలం పారిశ్రామిక సదస్సా లేక కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత ప్రచార వేదికనా అనే ప్రశ్నలు దౌత్య, రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. వివాదానికి ప్రధాన బీజం ఏఐసీసీ వేదికగా సీనియర్ నేత, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ చేసిన తాజా వ్యాఖ్యలే కారణం. స్విట్జర్లాండ్‌లోని దావోస్ సదస్సు తరహాలో హైదరాబాద్‌ను ఒక శాశ్వత అంతర్జాతీయ మేధో కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెబుతూనే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విదేశాంగ ధోరణులను ఆయన పరోక్షంగా ప్రశ్నించారు. నెహ్రూ అలీన విధానం, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు రూపకల్పన చేసిన రాజనీతి సిద్ధాంతాలతో పాటు భవిష్యత్ ప్రపంచానికి రాహుల్ గాంధీ అందించే నూతన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రపంచ ప్రతినిధుల ముందుంచే వేదికగా దీనిని నిర్వహిస్తున్నామని ప్రకటించడం ద్వారా ఈ సదస్సు చుట్టూ రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా విచ్చేస్తుండటంతో పాటు శామ్ పిట్రోడా, శశి థరూర్, గుర్దీప్ సప్పల్ వంటి కాంగ్రెస్ రంగాధిపతులు ఈ కార్యక్రమ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాల నుంచి విచ్చేస్తున్న దాదాపు 1,000 మంది ప్రతినిధులతో భౌగోళిక రాజకీయాలు, ప్రగతిశీల భావజాలం, ప్రజాస్వామ్య సూత్రాలపై చర్చలు జరపనున్నట్లు ప్రకటించారు. ఒక ప్రభుత్వ అధికారిక యంత్రాంగం, నిధులతో నడిచే సదస్సులో పార్టీ సిద్ధాంతాలకు, భావి రాజకీయ వ్యూహాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమనే డిబేట్ ప్రారంభమైంది. ఈ పరిణామాలపై విపక్ష బీజేపీ అత్యంత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతోంది. తెలంగాణ ప్రజల పన్నుల సొమ్మును, ప్రభుత్వ యంత్రాంగాన్ని రాహుల్ గాంధీ అంతర్జాతీయ ఇమేజ్ బిల్డింగ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎన్డీయే నేతలు ఆరోపిస్తున్నారు. నిజమైన పెట్టుబడుల సదస్సు అయితే ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు, పరిశ్రమల ఒప్పందాలు కేంద్రంగా చర్చలు జరగాలని, అలాకాకుండా నెహ్రూ విదేశాంగ విధానం గురించి ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు పెట్టడమేంటని విపక్షాలు నిలదీస్తున్నాయి. రాష్ట్ర నిరుద్యోగులు, రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి పార్టీ ప్రచారానికి వేదికగా మార్చడాన్ని తాము అంగీకరించబోమని హెచ్చరిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విమర్శలను ఏమాత్రం ఒప్పుకోవడం లేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ.. రాబోయే డిసెంబర్‌లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు ఈ భారత్ సమ్మిట్ ఒక బలమైన వైజ్ఞానిక, విజ్ఞాన భూమికగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కేవలం ఫ్యాక్టరీలు, పారిశ్రామిక నిధులే కాకుండా ప్రపంచ స్థాయి విధాన నిర్ణేతలు, సాంకేతిక నిపుణులు హైదరాబాద్ వేదికగా ఆలోచనలు పంచుకోవడం వల్ల తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచపటంలో మరింత పెరుగుతుందని, దీనిని రాజకీయ కోణంలో చూడకూడదని ప్రభుత్వం వాదిస్తోంది.

హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ విస్తరణ..

మొదటిపేజీ తరువాయి..

కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' , ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు



చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

సుందర్ పిచాయ్ బిజినెస్ లీడర్

మొదటిపేజీ తరువాయి..

దక్కించుకున్నారు. యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ నాలుగో స్థానంలో, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ ఐదో స్థానంలో నిలిచారు. దీంతో గ్లోబల్ టాప్–5 స్థానాలన్నీ అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలను నడిపిస్తున్న భారతీయ ఎగ్జిక్యూటివ్‌లకే దక్కడం విశేషం. హరూన్ తాజా నివేదిక ప్రకారం.. భారత్ వెలుపల ప్రధాన కార్యాలయాలు కలిగిన 200 అంతర్జాతీయ కంపెనీలకు 236 మంది భారత సంతతి వ్యక్తులు నేతృత్వం వహిస్తున్నారు. ఈ సంస్థల మొత్తం సంయుక్త మార్కెట్ విలువ అక్షరాలా రూ. 1,305 లక్షల కోట్లకు (15 ట్రిలియన్ డాలర్లు) చేరుకుంది. 2024 నాటి విలువైన రూ. 861.3 లక్షల కోట్లతో (9.9 ట్రిలియన్ డాలర్లు) పోలిస్తే ఇది ఏకంగా 53 శాతం వృద్ధి చెందడం గమనార్హం. అంతేకాకుండా, ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా సుమారు 53 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు సంయుక్తంగా రూ. 217.5 లక్షల కోట్ల (2.5 ట్రిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించగా, వీటి నికర లాభం రూ. 36.19 లక్షల కోట్లను (416 బిలియన్ డాలర్లు) తాకింది. కంపెనీల వృద్ధి తీరును గమనిస్తే.. 2024 నుంచి ఆల్ఫాబెట్ విలువ దాదాపు 98 శాతం పెరిగింది. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ విలువ స్వల్పంగా 17 శాతం మేర తగ్గడంతో సత్య నాదెళ్లను అధిగమించి సుందర్ పిచాయ్ ప్రథమ స్థానాన్ని చేజిక్కించుకున్నారు. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మౌలిక వసతుల్లో కీలకమైన మెమరీ చిప్స్‌కు డిమాండ్ భారీగా పెరగడంతో సంజయ్ మెహ్రోత్రా నేతృత్వంలోని 'మైక్రాన్ టెక్నాలజీ' మార్కెట్ విలువ కనీవినీ ఎరుగని రీతిలో 1,174 శాతం పెరిగి రూ. 121.8 లక్షల కోట్లకు (1.4 ట్రిలియన్ డాలర్లు) చేరింది. టాప్–5 కంపెనీల సంయుక్త విలువే రూ. 791.7 లక్షల కోట్లుగా (9.1 ట్రిలియన్ డాలర్లు) నమోదైంది. అంటే మొత్తం జాబితా విలువలో ఇది 61 శాతానికి సమానం. హరూన్ ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఒక ప్రత్యేక విభాగంగా చేర్చారు. ఇందులో చోటు దక్కించుకున్న 18 కంపెనీల మొత్తం విలువ రూ. 19.75 లక్షల కోట్లుగా (227 బిలియన్ డాలర్లు) తేలింది. కాగా, జాబితాలోని దాదాపు 103 కంపెనీలు ఏఐ ఆధారితంగా సేవలందిస్తుండగా, వీటి మార్కెట్ విలువ రూ. 930.9 లక్షల కోట్లుగా (10.7 ట్రిలియన్ డాలర్లు) ఉంది. ఇది మొత్తం జాబితా విలువలో 71 శాతం కావడం విశేషం. స్టార్టప్ విభాగంలో రూ. 5.22 లక్షల కోట్ల (60 బిలియన్ డాలర్లు) విలువతో ఏఐ కోడింగ్ సంస్థ 'కర్సర్' అగ్రస్థానంలో నిలిచింది. అత్యంత విలువైన టాప్–10 స్టార్టప్‌లలో ఏడు కంపెనీలు కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోనే ఉండగా, ఇవన్నీ అమెరికా కేంద్రంగానే పనిచేస్తున్నాయి. రంగాలవారీగా పరిశీలిస్తే.. 53 కంపెనీలతో సాఫ్ట్‌వేర్ & సర్వీసెస్ విభాగం మొదటి స్థానంలో నిలవగా, ఫైనాన్షియల్ సర్వీసెస్ (31 కంపెనీలు), హెల్త్‌కేర్ (21 కంపెనీలు) తర్వాతి స్థానాలను కైవసం చేసుకున్నాయి.

22ఏ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు



మొదటిపేజీ తరువాయి..

ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి చర్చించారు. 22ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కీలక చర్యలు తీసుకున్నట్లు



మంత్రి వివరించారు. జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు జారీచేసినట్లు తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ భూ సమస్యల పరిష్కారంపై ప్రతివారం జిల్లా స్థాయి అధికారులు సమీక్షించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఒకవేళ జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని దరఖాస్తులను ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలన్నారు. అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూములకు సంబంధించి వివిధ కోర్టుల తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్ల దాఖలుతోపాటు ఇతర అంశాలపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. యూఎల్‌సీ, అసైన్డ్ భూములు, వక్ఫ్ ఆస్తులు, భూదాన్, దేవదాయ తదితర భూములుగా ప్రైవేట్ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి, తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 24న ప్రత్యేక మెమోరాండం 47934ను జారీ చేసింది. కానీ కొత్తగా యూఎల్‌సీ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం ఆగిపోతున్నాయి. వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఆస్తులు, వేలం తర్వాత లేఅవుట్‌లుగా మారినవి, హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లు చేసి అమ్మిన ప్లాట్లు, పలు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా క్రమబద్ధీకరణ అయిన స్థలాలు అలాగే ఒకే సర్వే నంబరుతో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు రెండూ ఉన్న వాటిని 22ఏ నుంచి తొలగించకపోవడంతో ఆయా భూముల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తమిళనాడులో భారీ చోరీ కలకలం

మొదటిపేజీ తరువాయి..

జ్యువెలరీ షోరూంలో భారీ చోరీ జరిగింది. గత 15 రోజుల క్రితమే ఇక్కడ కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు దీపావళి సేల్స్ కోసం భారీ ఎత్తున బంగారు ఆభరణాలను షోరూంలో ఉంచారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బుధవారం అర్ధరాత్రి షోరూం షట్టర్‌ను బద్దలుకొట్టి లోపల ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఇక దొంగతనం విషయాన్ని షోరూం నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దుకాణం వెనుక గోడకు రంధ్రం చేసి దుండగులు లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. ఆపై దుకాణంలో ఉంచిన 35 కేజీలకు పైగా బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. చోరీకి గురైన బంగారం దాదాపు 35 కేజీల వరకు ఉండొచ్చని నిర్వాహకులు చెబుతున్నారు. ఇక భారీ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. క్లూస్ టీం సహాయంతో ప్రతి అణువణువూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. షోరూం సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను సైతం పరిశీలిస్తున్నారు. ఈ దోపిడీలో ముగ్గురి కంటే ఎక్కువ మంది సభ్యులు పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, కడలూరులో ఓ వ్యాపారి నుంచి 46 కిలోల వెండిని దోపిడీ చేసిన ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచిరాపల్లికి చెందిన మహమ్మద్ హుస్సేన్ వెండి ఆభరణాల వ్యాపారి. ఆయన నవంబర్ 8న సుమారు 46 కిలోల బరువున్న వెండి వస్తువులను తీసుకుని బస్సులో చెన్నైకి బయలుదేరారు. ఆ రోజు రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో హుస్సేన్ తాంబరం సమీపంలోని పెరుంగళత్తూరు బస్సు స్టాండ్‌లో దిగారు. మరో బస్సు కోసం వేచి ఉన్నారు. అప్పుడు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా ఆయనను చుట్టుముట్టి, కొడవలితో తల వెనుక భాగంపై దాడి చేశారు. దీంతో హుస్సేన్ స్పృహ తప్పి పడిపోవడంతో దుండగులు ఆయన వద్ద ఉన్న 46 కిలోల వెండి వస్తువులను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. వారిలో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరోవైపు, చెన్నైలోని పెరియమేడులో ఉన్న ఒక బంగారు ఆభరణాల తయారీ సంస్థలో సుమారు 350 గ్రాముల పసిడిని దొంగిలించినందుకు అదే సంస్థకు చెందిన ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 228 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బంగాల్‌కు చెందిన ముఖేశ్ గోరాయ్ (25) అని పోలీసులు వెల్లడించారు.

వీసీ అల్దాస్ జానయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశాలు


మొదటిపేజీ తరువాయి..

ఆందోళన చేపట్టారు. మరోవైపు వీసీ అల్దాస్ జానయ్యకు తెలంగాణరాష్ట్ర మహిళాకమిషన్ నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీసీ అల్దాస్ జానయ్య వ్యవహారంపై విచారణకు నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. గిడ్డంగి సంస్థ ఎండీ లక్ష్మి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయగా.. గోపి, రాహుల్ రాజ్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీత కృష్ణన సభ్యులుగా ఉన్నారు. 15 రోజుల్లో పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వం కమిటీకి ఆదేశాలు జారీ చేసింది.

అమెరికాలో మరోసారి కాల్పులు

మొదటిపేజీ తరువాయి..

కాల్పులకు పాల్పడిన అనుమానితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు.



భద్రతా కారణాల దృష్ట్యా ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని పోలీసులు ఎక్స్ వేదికగా హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఈ కాల్పులు వైట్ హౌస్‌కు సమీపంలో జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అసలు కాల్పులు జరిపింది ఎవరూ, కాల్పులకు గల కారణాలు ఏంటి అనేవి పూర్తి తెలుసుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

కేజ్రీవాల్ కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి..

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినంటూ పరిచయం చేసుకున్న సదరు వ్యక్తి, భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ పంజాబ్‌లోని మోహాలీ పోలీసులకు నవంబర్ 6న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో మోహాలీ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను మొహాలీ సైబర్ క్రైమ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్‌కు అప్పగించారు. బెదిరింపులకు ఉపయోగించిన మొబైల్ నంబర్ కాల్ డేటా రికార్డులు (సీడీఆర్), ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) లాగ్‌లు, లొకేషన్ సమాచారాన్ని పోలీసులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. ఈ ముఠా నిజంగానే బిష్ణోయ్ నెట్‌వర్క్‌కు చెందినదా? లేదా కేవలం వారి పేరును వాడుకున్నారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. మరోవైపు, ఈ బెదిరింపుల నేపథ్యంలో కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ పోలీసులను కోరారు.

బీఆర్ఎస్‌కు కొత్త జోష్..

గులాబీ గూటికి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు! ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో పార్టీలో చేరిక

నేరడిగొండ, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోంది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతిని



ధులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఈ క్రమంలో గురువారం మండలంలోని కుమారి గ్రామ ఉప సర్పంచ్ ఆడెపు రవితో పాటు వార్డు సభ్యులు మెస్రం సంబు, పోర్స సాయి యాదవ్, నందడెపు రవి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో వారు గులాబీ కండువాలు కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో నేరడిగొండ మాజీ జెడ్పీటీసీ గడ్డం భీమ్ రెడ్డి, వార్డు సభ్యుడు జి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బోండిడిలో దూడలకు నట్టల నివారణ పంపిణీ

నేరడిగొండ, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా గురువారం



బోండిడి గ్రామంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీతా రాథోడ్ పాల్గొని దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ఆర్థికంగా బలపడతారని, ప్రతి రైతు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది రైతులకు పశువుల ఆరోగ్య సంరక్షణపై పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

సోన్, నవంబర్ 13(ప్రజాజ్యోతి):
అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్



మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పేరుతో కేటీఆర్ రాజకీయం చేయడంసరికాదు

బీఆర్ఎస్ 10 యేండ్ల హయాంలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

ఖానాపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి)
ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతు గర్జన సభలో తో పాటు పలు సందర్భాల్లో కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవని, రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో రైతులు, నిరుద్యోగులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి అంశాలపై ప్రభుత్వం తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించిందని తెలిపారు. కానీ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా, కేటీఆర్ కేవలం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం విచారకరమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే రైతులను ప్రభుత్వం అప్రమత్తం చేసిందని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. ప్రకృతి పరిస్థితులను కూడా ప్రభుత్వంపై నెట్టడం కేటీఆర్ రాజకీయ వైఖరికి నిదర్శనమని బొజ్జు పటేల్ దుయ్య బట్టారు రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. గత



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేసుకుందే తప్ప, రాష్ట్రానికి మిగిల్చింది అప్పుల భారమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ప్రజలందరికీ తెలిసిందేనని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన అప్పులు, ప్రజలకు అందించిన ప్రయోజనాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. కుటుంబ రాజకీయాలు, అధికారం కోసం ఆరాటం పక్కనపెట్టి ప్రజల సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ అంశం కాదు.. అది బాధ్యత. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గత పాలనకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలే అర్థం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిర్మల్ మునిసిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్, నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ ఆకుల హరీష్,ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడగల భూషణ్,డీసీసీ జనరల్ సెక్రటరీ జునైద్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సమరసింహా రెడ్డి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కట్టే శ్యామ్ నిర్మల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

హలో నేతకాని చలో ఉస్మానియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ప్రసాద్ నేత

జన్నారం,నవంబర్12(ప్రజాజ్యోతి)
హైదరాబాదులో ఈ నెల 15 న నిర్వహించే హలో నేతకాని చలో ఉస్మానియా కార్యక్రమానికి నేతకాని



కుల బాంధవులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టిఎస్ఎంవిఎస్ ఓయూ జేఏసీ ప్రోగ్రాం కన్వీనర్ సాయిని ప్రసాద్ నేత కోరారు.గురువారం జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హలో నేతకాని చలో ఉస్మానియా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో నేతకాని సమాజానికి న్యాయం జరగాలని సామాజికంగా ఆర్థికంగా విద్యాపరంగా వెనుకబడిన నేతకాని వర్గానికి విద్య ఉద్యోగ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు నేతకాని సమాజ హక్కుల పరిరక్షణ కోసం కుల బాంధవులు ఐక్యంగా ముందుకు రావాలని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కావున ఈ నెల 15న హైదరాబాదులో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ తాళ్లపల్లి రాజేశ్వర్, ప్రోగ్రాం వైస్ చైర్మన్ బోర్లగుంట ప్రభుదాస్, ప్రోగ్రాం కో కన్వీనర్ జాడి గంగాధర్, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ కుమార్, మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు దుర్గం వసంత్, సీనియర్ నాయకులు కుకటికారి బుచ్చయ్య, దుర్గం లక్ష్మీరాజాం, జునుగురి మల్లయ్య, దుర్గం నందయ్య, రత్నం మాణిక్యం, వినయ్ భాస్కర్ బెంబడి భాస్కర్, దత్తు తదితర నేతకాని నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి

ఆసిఫాబాద్, నవంబర్ 12 ప్రజా జ్యోతి :
అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద



కుటుంబాలకు అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అంకుషాపూర్ సర్పంచ్, ఆసిఫాబాద్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు టేకం గంగారం అన్నారు. గురువారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన నూతన పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరాలని, సమాజంలోని చివరి వ్యక్తికి సైతం ప్రభుత్వ సహాయం అందాలన్నారు. పెన్షన్లు నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవనానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

బ్యాంకు ఖాతాతో కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా భరోసా.

మృతుడి భార్యకు బీమా చెక్కు అందజేత.. ఖాతాదారులకు పలు ఆర్థిక సేవలు.

మందమర్రి , నవంబర్ 12(ప్రజాజ్యోతి) :
బ్యాంకు ఖాతాదారులకు అందించే ప్రమాద బీమా సౌకర్యం ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. ఈ క్రమంలో గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ ఖాతాదారుడు నజీర్ మొహమ్మద్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, ఆయనకు ఉన్న గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతా ప్రమాద బీమా సౌకర్యం ద్వారా భార్య ఫాతిమా బీకి రూ.2 లక్షల పరిహారం అందజేశారు. మంచిర్యాల కార్పొరేటర్ మహమ్మద్ గౌసుద్దీన్ చేతుల మీదుగా బీమా చెక్కును అందించారు.ఈ సందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతులకు ఏడాదికి 10.50 శాతం వడ్డీతో వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల పరిసర గ్రామాల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించి పెన్షనర్లు, ఇతర ఖాతాదారులకు తమ గ్రామాల్లోనే బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. బ్రాంచి మేనేజర్ కేలేటి ప్రవీణ్ మాట్లాడుతూ ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 24 గంటలూ ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో గ్రాముకు గరిష్ఠంగా రూ.10 వేల వరకు రుణం అందిస్తున్నామని, వ్యాపారుల అభివృద్ధికి అవసరమైన రుణ సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు.



సేవింగ్స్ ఖాతాల ప్రారంభానికి అవసరమైన ఫొటోలు, జిరాక్స్‌లను బ్యాంకులో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టాఫీస్ డిపాజిట్లపై కూడా 10 శాతం వార్షిక వడ్డీ రేటుతో రుణ సదుపాయం కల్పిస్తున్నామని, ఖాతాదారులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ అధికారి జి.సుధాకర్, ఆర్.రమేష్, జూనియర్ అధికారి ఇ.శివకుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,నవంబర్ 12 ,(ప్రజాజ్యోతి):
విద్యార్థులు, యువ ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో 009–నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఆర్డీవో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి దేవిదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని, విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు నవంబర్ 13న ఉదయం 11 గంటలకు నిర్మల్‌లోని భాగ్యనగర్ నారాయణ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎంపికైన విద్యార్థులను సకాలంలో పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పిల్లల్లో న్యుమోనియా నివారణపై అవగాహన

నేరడిగొండ నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎస్ ఏ ఏ యన్ ఎస్ 2026–27 కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లల్లో న్యుమోనియా నివారణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ సద్దాం



అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా పీహెచ్‌సీలో గర్భిణులకు ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్లు ఏ.సంతోష్, బి.స్వర్ణలత, ఆశా కార్యకర్తలు గీత, రజిని, జయమ్మ, హూలాబాయి, గర్భిణులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేస్తాం

చేయూత పథకం కింద 8,270 మందికి కొత్త పెన్షన్లు అర్హులెవరూ ఆందోళన చెందవద్దు: కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, నవంబర్ 12 ప్రజా జ్యోతి:
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున పెన్షన్లు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కోవా లక్ష్మి,



అదనపు కలెక్టర్ యువరాజు మార్మట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్‌తో కలిసి నూతనంగా మంజూరైన పెన్షన్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చేయూత పథకం కింద జిల్లాలో 9,466 మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన 8,270 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హత ఉన్నవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ దత్తారావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్, కౌన్సిలర్లు బాలకృష్ణ, వినోద్, సలాం, సర్పంచులు పాల్గొన్నారు.

భారత్‌మాల జాతీయ రహదారిపై ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పిటిసి వడ్డేపల్లి శ్రీనివాసులుకి వినతి

ఆలంపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
రాజోలి–వడ్డేపల్లి మండలాల సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకమైన భారత్‌మాల జాతీయ రహదారిపై ప్రజలకు అవసరమైన సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ★రాజోలి గ్రామస్తుల తరఫున అర్చకులు అడివిస్వామి అలంపూర్ నియోజకవర్గ,మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులుని కలిసి వినతి పత్రం అందజేశారు.



ఈ సందర్భంగా భారత్‌మాల రహదారిపై తగిన ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు లేకపోవడం వల్ల రాజోలి, వడ్డేపల్లి మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రయాణించే ప్రజలకు ఈ సౌకర్యాలు ఎంతో అవసరమని వివరించారు. అలాగే భారత్‌మాల రహదారికి అనుసంధానంగా సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేస్తే రాజోలి–వడ్డేపల్లి మండలాల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. వారు అన్నారు అదేవిధంగా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం సులభతరమవుతుంది. అన్నారు అదేవిధంగా స్థానిక వ్యాపార, వాణిజ్య రంగాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. అదేవిధంగాపరిశ్రమలు, గోదాములు, ఇతర వ్యాపార సంస్థల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయి. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. అదేవిధంగా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుంది. అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రయాణ దూరం, సమయం మరియు ఇంధన ఖర్చులు తగ్గుతాయి. వారు అన్నారుఈ సమస్యపై వడ్డేపల్లి శ్రీనివాసులు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, భారత్‌మాల రహదారిపై సర్వీస్ రోడ్డు, ఎంట్రీ, ఎగ్జిట్ సౌకర్యాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ నెల 14న లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ఆలంపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో ఈ నెల 14-11-2026 (శనివారం) ఉదయం 10:00 గంటలకు అలంపూర్ ఎక్స్ రోడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయిజ మండలానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అయిజ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత లబ్ధిదారులు హాజరుకావాలని కోరడమైనది.కావున ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని విజ్ఞప్తి. చేశారు.

ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన ఉండాలి

డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ నిహారిక

నాగర్ కర్నూల్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి):
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జాతీ య న్యాయసేవ దినోత్సవం (నవంబర్ 9) ని పుర స్కరించుకుని



నిర్వహించే వారోత్సవాలలో బాగం గా గురువారం బిజినపల్లి మండలం వడ్డెమాన్ గ్రా మ పంచాయతీ కార్యాలయంలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహ న కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్రెటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అ థారిటీ నిహారిక హజరై మాట్లాడుతూ ప్రతి ఒక్క రు చట్టాలపట్ల కనీస అవగాహన కలిగి ఉండాలి అన్నారు.ఈ విధంగా అవగాహన కలిగి ఉండడం వల్ల సమాజంలో నేరాలు జరగకుండా అరికట్టవ చ్చని,తద్వారా నేరరహిత సమాజాన్ని నిర్మించవ చ్చని అన్నారు.అదేవిధంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసె స్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు.సైబర్ క్రైమ్,మోటార్ వెహికల్ ఆక్ట్, పోక్సో చట్టంగురించి వివరిస్తూ ఎవరైనా న్యాయ వాదిని పెట్టుకునే స్తోమతలేని వారుంటే మా సంస్థ తరుపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తా మని,ఉచిత న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవ చ్చని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పం చాయతీ కార్యదర్శి,పాఠ శాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గండిడ్ ఎస్సీ కాలనీలో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజా జ్యోతి, గండిడ్:
గండిడ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చాలా కాలంగా నెలకొన్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న తక్కువ విద్యుత్ వోల్టేజ్ సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గండిడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆర్. భగవంతు రెడ్డి, ఉప సర్పంచ్ గుమ్మడాల చెన్నయ్య, సొసైటీ డైరెక్టర్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

ప్రయాణికుల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి
నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి, అడాక్ కమిటీ సభ్యులు టైగర్ రమేష్ కొప్పుల

నాగర్ కర్నూల్
నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):
కొల్లాపూర్ ఎక్సరోడ్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని కొప్పుల రమేష్ ఆరోపించారు. ఈ ప్రాంతం నుంచి నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాలకు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు, వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే సామాన్య ప్రజలకు ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన రవాణా కూడలిగా మారింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికులు నిలబడేందుకు కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరం. ముఖ్యంగా ఎండాకాలంలో ఎండ తీవ్రతను తట్టుకుంటూ, వర్షాకాలంలో వర్షంలో తడుస్తూ, చలికాలంలో చలికి ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్నపిల్లలతో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
అదేవిధంగా కొల్లాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో కలెక్టర్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, ఆసుపత్రులు, దేవాలయాలు వంటి అనేక ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు



అవసరమైన ప్రదేశాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఈ ప్రాంతానికి వివిధ పనుల నిమిత్తం ఎంతోమంది ప్రజలు వస్తుంటారు. ఇంతటి రద్దీ, ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో ప్రయాణికుల కోసం ఒక బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.
ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు బాధ్యత. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నీడ కల్పించడం, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యం కల్పించడం ఎంతో అవసరం. అలాగే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులు నిలిచేందుకు సరైన స్థలాన్ని గుర్తించి బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలి.ఇంతమంది ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ సమస్యపై ఇప్పటివరకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు . కాగా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలాంటి ప్రాథమిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆరోపించారు ఇప్పటికైనా సంబంధిత..ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికుల రద్దీని పరిశీలించి, వెంటనే అన్ని సౌకర్యాలతో కూడిన బస్ షెల్టర్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ తరపున సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ సుబ్బారెడ్డి దివాకర్ నాయుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు

వనపర్తి అభివృద్ధికి విశాల రహదారులే ప్రాధాన్యం

విస్తరణ పనుల్లో జాప్యం వద్దు.. నాణ్యతలో రాజీ పడొద్దు
నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, నవంబరు 12 (ప్రజాజ్యోతి):
పట్టణ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, భవిష్యత్తు అవసరాలకు



అనుగుణంగా రహదారులను విస్తరించడమే లక్ష్యంగా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌరస్తా వద్ద జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు. పనుల సమయంలో ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా విశాలమైన రహదారులు, మెరుగైన రవాణా సదుపాయాలు కల్పిస్తేనే వనపర్తి పట్టణం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి అందరి బాధ్యత అని, రోడ్ల విస్తరణతో భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, వ్యాపారులు పనులకు సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పట్టణ అధ్యక్షుడు కదిరే



రాములు, స్థానిక కౌన్సిలర్ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గగ్గలపల్లి పాఠశాలలో షెడ్ నిర్మాణానికి భూమి పూజ

–1,60,000 వ్యయంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మాణం

నాగర్ కర్నూల్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి):
నాగర్ కర్నూల్ మండల గగ్గలపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించబోయే షెడ్డు నిర్మాణానికి గు రువారం ఘనంగా భూమి పూజ



నిర్వహించారు. సుమారు 1 లక్షా 60 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న షెడ్డు నిర్మాణానికి ముఖ్య అతిథిగా లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ,డిస్ట్రిక్ట్ కో-ఆర్డి నేటర్ దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,నిర్మాణానికి ఆర్థికంగా సహకరిస్తున్న లయన్స్ సభ్యులు కలిసి పూజా కా ర్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాధాకృ ష్ణ మాట్లాడుతూ,గతంలో దొడ్ల రాజవర్ధన్ రెడ్డి ల యన్స్ క్లబ్ అధ్యక్షులుగా పనిచేసిన సమయంలో పాఠశాలలో వేదికను నిర్మించడం జరిగిందని పాఠ శాల ఉపాధ్యాయుల కోరిక మేరకు ఇప్పుడు అదే వేదికపై షెడ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేకప్రాంతాల్లో బస్సు షెల్టర్లు,ప్రభుత్వ పాఠశాలలకు నీటి ట్యాంకులను అందిస్తున్నామని,ఇక ముందు కూడా ఇలాంటి సే వా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాజశేఖర్ రావు మాట్లాడు తూ,పాఠశాలకు అవసర మైన షెడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చిన లయన్స్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని,విద్యార్థులకు ఎం డ,వాన నుండి రక్షణ కల్పించడంతో పాటు,పాఠ శాల కార్యక్రమాల నిర్వహణకు షెడ్ ఎంతో ఉప యోగపడుతుందని అన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిలేందర్,డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ దొడ్ల రాజ వర్ధన్ రెడ్డి,దొడ్ల ఈశ్వర్ రెడ్డి,క్లబ్‌అధ్యక్షుడు అమ రేందర్ రెడ్డి,కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి,కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి,మాజీ అధ్యక్షులు తెప్ప శ్రీను, రామకృష్ణ రెడ్డి,సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పం చ్ ఉమర్,వార్డు సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయు లు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల వేళ మైనార్టీల సంక్షేమం.. పనుల వేళ వారి ఆరోగ్యం పట్టదా..?

బీకేరెడ్డి కాలనీలో భారీ కాలువ నిర్మాణంపై స్థానికుల ఆగ్రహం
అవసరానికి మించి కాలువ నిర్మాణం ఎందుకు..? ముస్లిం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తున్నారంటూ ఆరోపణలు.. పనులు నిలిపివేసి విచారణ చేపట్టాలని డిమాండ్

మహబూబ్‌నగర్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి బ్యూరో):
ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యమని, మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పాలకులు తరచూ చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని బీ.కే. రెడ్డి కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ నంబర్ 49 పరిధిలోని బీఎన్ రెడ్డి కాలనీలో చెరువు కట్ట తూము నీటి ప్రవాహం కోసం నిర్మిస్తున్న భారీ కాలువ స్థానిక ప్రజలకు ఆందోళనగా మారింది. నీటి ప్రవాహానికి అవసరమైన మేరకు మాత్రమే కాలువ నిర్మించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అవసరానికి మించి భారీ కాలువ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆరోగ్యపరమైన, భద్రతాపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కాలువ పనుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

మైనార్టీల సంక్షేమం మాటలకే పరిమితమా.?

ఈ వ్యవహారంలో మరో కీలకమైన అంశాన్ని స్థానికులు లేవనెత్తుతున్నారు. కాలువ నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో ముస్లిం మైనార్టీ కుటుంబాలు



నివసిస్తున్న నేపథ్యంలో, వారి అభిప్రాయాలను, ఆరోగ్య భద్రతను పరిగణనలోకి తీసుకోకుండా పనులు చేపట్టడం వెనుక వివక్ష ఉందా.? అన్న అనుమానాలను కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీల ఓట్ల కోసం సంక్షేమం, అభివృద్ధి అంటూ హామీలు ఇచ్చే నాయకులు, వారి నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల పనులు చేపట్టేటప్పుడు మాత్రం వారి సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.అయితే ఈ నిర్మాణం వెనుక ఉద్దేశపూర్వక వివక్ష ఉందా.? లేక సాంకేతిక ప్రణాళికలో లోపాలున్నాయా.? అన్నది సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితేనే స్పష్టమవుతుంది.

అధికారులకు కనిపించని ప్రజల ఆవేదన.?

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపశమనం కలిగించాలి కానీ, వారి ఆరోగ్యానికి, ప్రశాంత జీవనానికి ముప్పుగా మారకూడదు. కాలువ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అనుమతులు, అంచనాలు, డిజైన్, నీటి ప్రవాహ సామర్థ్యం వంటి అంశాలను అధికారులు బహిరంగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.కాబట్టి సంబంధిత అధికారులు తక్షణమే కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరించి, ఆరోగ్య భద్రతకు భంగం కలగని ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు చేపట్టడం కాదు.. ప్రజల ఆరోగ్యం, భద్రత, ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన సంక్షేమం. బీకే రెడ్డి కాలనీ ప్రజల ఆవేదనకు పాలకులు, అధికారులు ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాలి.!

రైతుల సంక్షేమానికి పెద్దపీట..వడ్డేపల్లి పీఏసీఎస్ పగ్గాలు కొత్త పాలకవర్గం చేతికి!

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పీఏసీఎస్ నూతన పాలకవర్గం!
వడ్డేపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్‌గా బి.రామకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం
నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అలంపూర్ ప్రజల అభివృద్ధి కోసమే కృషి చేస్తా"
డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) నవంబర్ 12:
రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ అన్నారు.వడ్డేపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్‌గా బి.రామకృష్ణారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ, అలంపూర్ నియోజకవర్గ ప్రజలు తన పేరు పక్కన అలంపూర్ మాజీ శాసనసభ్యుడు'అనే గుర్తింపును శాశ్వతంగా నిలిపి



నందుకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అలంపూర్ ప్రజల బాగోగులు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం తపిస్తానని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సహకారంతో అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు, సహకారంతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని నూతన చైర్మన్,వైస్ చైర్మన్‌కు సూచించారు.
అనంతరం నూతన చైర్మన్ ఎనుముల నాగరాజు,వైస్ చైర్మన్ బి.రామకృష్ణారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అణిచేశ్వర్ రెడ్డి, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్



చైర్మన్ పచ్చర్ల కుమార్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీను, ఆర్టీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామ రెడ్డి,వడ్డేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వాల్మీకి కమిటీ చైర్మన్ గట్టు తిమ్మప్ప,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంకపురం రాముడు,వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు,జిల్లా కాంగ్రెస్ నాయకులు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్-నినో ప్రభావంతో యాసంగి సాగుపై ఆందోళన!

వరి సాగులో ఆచితూచి అడుగేయాలి..
తక్కువ నీటితో పండే అపరాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

పర్వతగిరి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
ఎల్-నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యతపై ప్రభావం పడే ప్రమాదం ఉందని



గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఈఒ) రవి రైతులకు సూచించారు. నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయకుండా తొందరపడి పంటలు సాగు చేస్తే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉండే వరి సాగు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట మధ్యలో నీరు అందకపోతే పంట ఎండిపోయి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు తమ వద్ద అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భజలాలు, సాగునీటి పరిస్థితులను పరిశీలించిన తర్వాతే పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పెసర, శనగ, కంది వంటి అపరాల పంటలను ప్రత్యామ్నాయంగా పరిశీలించాలని సూచించారు. రైతులకు ఆర్థిక నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే వ్యవసాయ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి రైతు గమనించి, ఇతర రైతులకు కూడా తెలియజేయాలని ఎఈఒ రవి కోరారు.

స్వర్ణ పతక విజేత దీప్తికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన సన్మానం

తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి చాటిన క్రీడాకారిణి..
ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చూస్తా

పర్వతగిరి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
జపాన్‌లో నిర్వహించిన ఆసియా పారా గేమ్స్-2026లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో 56.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకం సాధించిన వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవంజిని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘనంగా సన్మానించారు. హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో దీప్తిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రీడా వేదికపై స్వర్ణ పతకం సాధించి తెలంగాణ ఖ్యాతిని చాటిన దీప్తి జీవంజి విజయం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి పట్టుదల, క్రమశిక్షణ,



నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె విజయం యువ క్రీడాకారులకు, ముఖ్యంగా పారా క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు. దీప్తి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దీప్తి జీవంజికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు, ఇతర ప్రయోజనాల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటిని అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దీప్తి తల్లిదండ్రులు ధనమ్మ, యాదగిరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి
కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

పరకాల, నవంబర్ 12, (ప్రజా జ్యోతి):
పరకాల పట్టణంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ



ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ.. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు బుజ్జ హేమంత్, మండల ఉపాధ్యక్షుడు రాహుల్, పట్టణ కార్యదర్శి అప్రోజు తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించి 3.03 కోట్లు మింగిన పరమేశ్వర రైస్ మిల్లు యాజమాన్యం

రూ.3.03 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి.. ఐదుగురు భాగస్వాములపై కేసు నమోదు.. జైలుకు తరలింపు!

రాయపర్తి నవంబర్ 12 ప్రజా జ్యోతి:
పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందించాల్సిన ప్రభుత్వ బియ్యాన్ని పక్కదారి పట్టించి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లు యాజమాన్యంపై అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రూపంలో తిరిగి అప్పగించాల్సిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి, వచ్చిన డబ్బులను పంచుకున్నారనే ఆరోపణలతో ఐదుగురు భాగస్వాములపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ (టి జి సి ఎస్ సి ఏ ల్) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామంలోని మెస్సర్స్ పరమేశ్వరి రైస్ ఇండస్ట్రీస్‌కు కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ ధాన్యాన్ని



అప్పగించారు. కేఎంఎస్ 2023-24 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వంతో సక్రమంగా కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం చేసుకుని, ధాన్యాన్ని మర ఆడించి నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి సరఫరా చేయాల్సి ఉంది..ఇదిలా ఉండగా, 2022-2023 రబీ సీజన్‌లో పేదలకు పంపిణీ చేయాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లింగ్ కోసం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా సదరు మిల్లుకు కేటాయించారు. ఐకేపీ, సొసైటీ కేంద్రాల నుంచి మొత్తం 467.426 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులో నిల్వ చేసినట్లు వివరాలు పేర్కొంటున్నాయి.అదేవిధంగా 2023-2024 ఖరీఫ్ సీజన్‌లో మరో 468.708 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుకు కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు సీజన్లకు సంబంధించిన ధాన్యం విలువ మొత్తం రూ.3,03,13,436గా పేర్కొనబడింది.ఐదుగురు భాగస్వాములుగా ఏర్పడి మెస్సర్స్ పరమేశ్వరి రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యంలో చిర్రా ఉపేంద్ర, పుల్ల ఎల్ల గౌడ్, ఆవుల కేశవ రెడ్డి, అలువల ప్రభాకర్ రెడ్డి, వంగల నర్సయ్య ఐదుగురు భాగస్వాములుగా ఉన్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం పేదల కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ రూపంలో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, ఆ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి, విక్రయాల ద్వారా వచ్చిన నగదును ఐదుగురు భాగస్వాములుపంచుకున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. ప్రజా పంపిణీ వ్యవస్థకు తీరని నష్టం.ప్రభుత్వం పేద ప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించడం ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యానికి విరుద్ధమనే విమర్శలువ్యక్తమవుతున్నాయి... పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కలిగించడమే కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు అందాల్సిన ఆహార ధాన్యాల సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది..ఐదుగురిపై కేసు.. జైలుకు తరలింపు ఈ వ్యవహారంపై వరంగల్ జిల్లా సివిల్ సప్లైస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి. సంధ్యారాణి (42), భర్త మహేందర్, హసన్‌పర్తి మండలం భీమారం నివాసి, ఫిర్యాదు



ఆధారంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి...ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన వ్యవహారంలో ఐదుగురు భాగస్వాములపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి

ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్

పరకాల, నవంబర్ 12, (ప్రజాజ్యోతి):
యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ



నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సూచించారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆత్మ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అనిశ్చితి, భూగర్భ జలాల తగ్గుదల వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు పంట ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని, నిరంతర నీటి వినియోగం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుందని వివరించారు. శనగ, పెసర, మినుము, వేరుశనగ, ఆవాలు తదితర పంటలను భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. టీఆర్‌పీకే శాస్త్రవేత్త డాక్టర్ బి.వి. రాజ్‌కుమార్



మాట్లాడుతూ.. శాస్త్రీయ సాగు పద్ధతులతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని, పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పప్పుధాన్యాల సాగుతో నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం మెరుగుపడుతుందన్నారు. సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అవసరమైనప్పుడు మాత్రమే శాస్త్రీయ సిఫారసుల మేరకు పురుగుమందులు వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జంగే భాస్కర్, జోరు ప్రశాంత్, సూత్రపు గోపినాథ్, మాదారపు రామకృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన తిరుమలాయపల్లి గ్రామ ప్రజలు

ముద్రబోయిన ముత్తయ్య కుటుంబానికి రూ.61,500 ఆర్థిక సహాయం అందజేత

రాయపర్తి నవంబర్ 12 ప్రజా జ్యోతి:
తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్రబోయిన ముత్తయ్య గా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం వారి 11వ రోజు కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామానికి



చెందిన పలువురు పెద్దలు, నాయకులు, యువకులు, గ్రామస్తులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామంలోని దాతలు స్వచ్ఛందంగా అందించిన విరాళాలను కలిపి మొత్తం రూ.61,500/- (అక్షరాలా అరవై ఒక వేల ఐదు వందల రూపాయలు)ముత్తయ్య కుమారుడు ముద్రబోయిన నరసయ్య కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ముత్తయ్య గారు గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి, అందరికీ ఆత్మీయంగా మెలిగిన వ్యక్తి అని పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన మరణంతో కుటుంబానికి తీరని లోటు ఏర్పడినప్పటికీ, ఈ కష్ట సమయంలో గ్రామస్తులందరూ ఒక్కటిగా నిలబడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జినుగు వేమన్ రెడ్డి (పోలీస్ పటేల్), మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వశపాక ఎల్లయ్య, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శిలా ఎల్లారెడ్డి, పారుపల్లి మధుసూదన్ రెడ్డి, గుడి రామచంద్రారెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు భాషబోయిన నాగరాజు, శ్రీ భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు, యువజన నాయకులు, సీనియర్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.కులమత, రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో స్పందించి విరాళాలు అందించిన ప్రతి ఒక్క దాతకు, ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం. ఐక్యతకు, ఆత్మీయతకు తిరుమలాయపల్లి గ్రామ ప్రజలు మరోసారి నిదర్శనంగా నిలిచారూ.

కలెక్టరేట్‌ను సందర్శించిన చైతన్య పాఠశాల విద్యార్థులు

గణపురం ప్రజాజ్యోతి నవంబర్ 12:
గణపురం మండల లోని చెల్పూర్ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో బి. వసంతకుమారి, డీపీఆర్వో ఎస్. శ్రీనివాస్, సీపీఓ మార్త కిష్టయ్య, డీఈఓ లలితకుమారిని విద్యార్థులు కలిసి వారి విధుల గురించి తెలుసుకున్నారు. లైజన్ అధికారి సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశ్విని అంటోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాపారులకు అండగా నిలవాలి

నేపాల్, టిబెట్ స్వెటర్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, (ప్రజాజ్యోతి):
జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న నేపాల్, టిబెట్ ప్రాంతాల వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అశోక జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నేపాల్, టిబెట్‌కు చెందిన స్వెటర్ విక్రయ కేంద్రాన్ని గురువారం ఆయన



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి స్వెటర్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వారు మన సమాజంలో భాగమై స్థానికులతో కలిసిమెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి వ్యాపారాలకు, జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానికులు ప్రోత్సాహం అందించాలని కోరారు. వారికి సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షుడు శ్యామ్, నాయకులు తాడిచెట్టి విద్యాసాగర్, నలుబోల సతీష్, కట్ల శ్రీను, తోట రాజకుమార్, బియబాని, కల్లూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పర్వతగిరి విద్యార్థిని ప్రతిభ.. జాతీయస్థాయికి ఎంపిక

పర్వతగిరి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థిని బి. జ్ఞానేశ్వరి సత్తా చాటింది. 8వ తరగతి చదువుతున్న జ్ఞానేశ్వరి 80 మీటర్ల పరుగుపందెంలో ప్రతిభ కనబరిచి విజయం సాధించడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జ్ఞానేశ్వరి విజయం పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం!

పరకాల, నవంబర్ 12, (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని



పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గురువారం పరకాల ఆర్డీవో కార్యాలయంలో వివిధ రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భూ రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకారంతో సత్వర న్యాయానికి కృషి చేస్తా

నూతన జడ్జి మహమ్మద్ మునవార్ హుస్సేన్
తుంగతుర్తి కోర్టు నూతన జడ్జికి ఘన స్వాగతం
బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం

తుంగతుర్తి, నవంబర్ 12, (ప్రజా జ్యోతి):
న్యాయవాదుల సహకారంతో సత్వర న్యాయానికి కృషి చేస్తానని జడ్జి మహమ్మద్ మునవార్ హుస్సేన్ అన్నారు. గురువారం తుంగతుర్తి కోర్టుకు నూతనంగా జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి మహమ్మద్ మునవార్ హుస్సేన్‌కు తుంగతుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపర్తి జ్ఞాన సుందర్ అధ్యక్షతన



స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు నూతన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయమూర్తి మహమ్మద్ మునవార్ హుస్సేన్ మాట్లాడుతూ... న్యాయవాదుల సహకారంతో న్యాయస్థాన కార్యకలాపాలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. న్యాయవాదులు కూడా న్యాయవ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలను కాపాడుతూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ టి. హరి చరణ్, జాయింట్ సెక్రటరీ మల్లెపాక రవి, సీనియర్ న్యాయవాదులు జె. కుమారస్వామి, కె. వెంకటేశ్వర్లు, టి. సత్యనారాయణ, ఎస్.కె. వజీర్, బి. ప్రతాప్, వేణు రాజ్ యాదవ్, జె. చంద్ర మౌళి, నాగరాజ్, రాజారాం, ఓర్సు రాజు, సైదులు, శ్రీనివాస్ తదితర న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శివప్రసాద్ పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

చిన్నారి శివప్రసాద్‌ను ఆశీర్వదించి, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

దేవరకొండ, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) :
దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన నోముల సత్యనారాయణ–లింగమ్మ దంపతుల కుమారుడు శివప్రసాద్ పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పోలేపల్లి గేటు సమీపంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ



వేడుకకు దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి శివప్రసాద్‌కు ఎమ్మెల్యే బాలు నాయక్ ఆశీస్సులు అందజేశారు. తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, నోముల సైదులు, జర్పుల భధ్యా నాయక్, కిన్నెర హరికృష్ణ, వైఎస్ కరుణాకర్, అంగిరేకుల నాగభూషణం, ముకురోజు రాజు, రామావత్ సాయి కుమార్, ఎలుక జలంధర్ గౌడ్, నోముల రామకృష్ణ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్

ఆలేరు నవంబర్ 12 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో షిరిడి సాయిబాబాను అనుమకొండ మాజీ ఎమ్మెల్యే వినయ భాస్కర్ , ఆలయ అర్చకులు యోగేష్



గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించరూ. అనంతరం ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కమిటీ గారి అశోక్ , ప్రధాన కార్యదర్శి ఐడియా శ్రీనివాస్ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మురారి శెట్టి రాజేశ్వర్ భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమి పూజ

గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి

ఆలేరు నవంబర్ 12 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా గ్రామానికి చెందిన నాయక్ సారయ్య గుడిసెలలో ఉన్న బయట కమ్మరి వాళ్లకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లావణ్య వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకరయ్య, కుటుంబ సభ్యులు తదితరు పాల్గొన్నారు



కరువు సాయం ఎక్కడ? ప్రకటనలకే పరిమితమా!

దళారులతో కాంగ్రెస్ కుమ్మక్కు..
రోడ్లపాలైన రైతాంగం
కోతకొచ్చిన పంటకు కొనుగోళ్లు లేవు..
అమ్ముకున్న ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు.. ఇదేనా కాంగ్రెస్ రైతు సంక్షేమం?
రైతు రాజ్యం అని చెప్పి.. రైతును రోడ్డున పడేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
తక్షణమే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి

కోదాడ టౌన్ ,నవంబర్ 12 (ప్రజా జ్యోతి):
కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తమ నివాసంలో ప్రస్తుతం కోదాడ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రైతుల ఉసురు తీసుకుంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతపై మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ లో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, అలా ప్రకటించి ఇన్ని రోజులవుతున్నా నేటికీ ఆయా మండలాల్లో నష్టపోయిన రైతులను గుర్తించి ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా కరువు పరిహారం అందించకపోవడం ఈ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఒకపక్క కరువుతో అరాకొరా పండిన ధాన్యం కళ్లాల వద్దకు వచ్చి, అమ్ముకునే సమయానికి దళారులతో కాంగ్రెస్ నాయకులు మరియు ప్రభుత్వం కుమ్మక్కై రాత్రికి రాత్రే ధాన్యం రేట్లను అమాంతం తగ్గించడం అత్యంత దారుణమన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కూడా దక్కక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రభుత్వం ఏర్పడటానికి ముందు తాము ఇచ్చిన ప్రధాన హామీ అయిన 'ధాన్యానికి బోనస్' ను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు వరి కోతలు కోసి, రోజుల తరబడి రోడ్లమీద కుప్పలు పోసుకుని ఎదురుచూస్తున్నా... ఇంతవరకు (ఐకేపీ) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. ఐకేపీ సెంటర్లు ప్రారంభం కాకపోవడం వల్ల, గిట్టుబాటు ధర రాక రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రముఖంగా వచ్చిన పత్రికా కథనాలే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సజీవ సాక్ష్యాలు అన్నారు. పత్రికలు ఘోషిస్తున్నా, రైతులు రోడ్లపై కన్నీరు పెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోదాడ



నియోజకవర్గంలో ఐకేపీ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి, రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని, అలాగే పెండింగ్ లో ఉన్న కరువు పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడకపోతే, రైతాంగంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేలా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

తుంగతుర్తి, నవంబర్ 12, (ప్రజా జ్యోతి):
రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు,సూచించారు. తుంగతుర్తి శాసనసభ్యులు





మండల సామెల్ ఆదేశానుసారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణంలో రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్ని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం, గాజుల గూడెం, జేకే తండా లో ఉమెన్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, వెంపటి లోని వివో 1 మరియు 3 వ సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మరియు అధికారులతో కలిసి తగిలింది ప్రారంభించి మాట్లాడారు.రైతులకు ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన సహకారం అందించాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాకు రూ.2461, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2441 చెల్లించడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్ కు రూ.500 బోనస్ అందిస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించిన అనంతరం అధికారులు ఆన్‌లైన్ ట్యాబ్‌లో లేదా ట్రక్ షీట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో చలపతి, సూర్య తండా సర్పంచ్ బాజు భాయ్, వెంపటి సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, వార్డు సభ్యులు ఏర్పుల మహేష్, గుండ్ల శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి, ఆంగోతు రవీందర్, భాష బోయిన వెంకన్న, మాజీ ఎంపిటిసి ఆంగోత్ నరేష్, ఏపో దేవి ప్రసాద్, ఏఈఓ జోష్నా, సిసి రాంబాబు, సొసైటీ మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, సంఘ బంధం వివోలు ఐకెపి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ నియోజకవర్గంలో రూ.2.14 కోట్ల విలువైన 339 చెక్కుల పంపిణీ

2028 జూన్ నాటికి దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

దేవరకొండ, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) :
పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు





కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సియంఆర్ఎఫ్) పథకాల కింద మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 209 మంది లబ్ధిదారులకు రూ.84 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, మరో 130 మంది లబ్ధిదారులకు సుమారు రూ.1.30 కోట్ల విలువైన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. మొత్తంగా 339 మంది లబ్ధిదారులకు రూ.2.14 కోట్ల ఆర్థిక సహాయం అందించారు.

నిమ్స్‌లో ఎల్ఒసి ద్వారా ఉచిత వైద్య సేవలు పొందండి:

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలు నిమ్స్ ఆసుపత్రిలో ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్ఒసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఈ సదుపాయాన్ని అధిక సంఖ్యలో వినియోగించుకుంటున్నారని తెలిపారు. నిమ్స్‌లో అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు ఎల్ఒసి ద్వారా వైద్య సేవలు పొందేందుకు ముందుకు రావాలని కోరారు.

సూపర్ ఎల్‌నినోపై రైతులు అప్రమత్తంగా ఉండాలి:

రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బాలు నాయక్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు.

2028 జూన్ నాటికి దేవరకొండను సస్యశ్యామలం చేస్తాం:

దేవరకొండ నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 2028 జూన్ నాటికి ఎస్ఎల్బీసీతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సాగునీరు అందించి, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ప్రాంతాల మాదిరిగా పచ్చని పంటలతో దేవరకొండను సస్యశ్యామలం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ లక్ష్య సాధనకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని, ప్రజా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రైతుల సాగునీటి కష్టాలను తొలగించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నరసింహ, హనుమంతు వెంకటేష్ గౌడ్, సంబంధిత ప్రభుత్వ అధికారులు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుడిమిడిలో శ్రీ కంఠమా మహేశ్వర స్వామీ దేవాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ

నల్లగొండ నవంబర్ 12:(ప్రజా జ్యోతి ప్రతినిధి):
శాలి గౌరారం మండలం, తుడిమిడి:గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠమా మహేశ్వర స్వామీ దేవాలయం పునఃప్రారంభం, పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రూ.23 లక్షల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణ పనులను చేపట్టేందుకు గౌడ సంఘం కమిటీ ముందుకు వచ్చింది. గ్రామంలో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సంఘం పెద్దలు, సభ్యులు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దగౌడ్ బిక్కి సాయిలు, సారెకోళ్ల గౌడ్, గడ్డం వీరయ్య, బండపెల్లి అంజయ్య, యల్మకంటి లక్ష్మయ్య, బొమ్మగాని చంద్రయ్య, బొమ్మగాని కృష్ణ, పెద్ది పరమేష్, ఎరుకల మల్లేష్, బండి యాదగిరి, దుబ్బాక నరేష్, బండపెల్లి అశోక్, యల్మకంటి శ్రీనివాస్, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన బీఆర్ఎస్ నాయకుడు వడ్డ రమేష్

వివాహ వేడుకలో పాల్గొని ప్రవీణ్–జ్యోతి దంపతులను ఆశీర్వదించిన వడ్డ రమేష్

దేవరకొండ, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) :
డిండి మండలంలోని పెద్ద తండాకు చెందిన కాట్రావత్ ప్రవీణ్–జ్యోతి వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకుడు వడ్డ రమేష్ హాజరై



నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులను అభినందిస్తూ, వారి నూతన దాంపత్య జీవితం సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. జీవితాంతం పరస్పర ప్రేమాభిమానాలతో, అన్యోన్యంగా జీవిస్తూ కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ అభిమాన నాయకుడు వడ్డ రమేష్ వివాహ వేడుకకు హాజరై ఆశీర్వదించడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద తండా మాజీ సర్పంచ్ కాట్రావత్ వెంకటేష్ నాయక్, ఉపసర్పంచ్ విజయ్ నాయక్, అరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అదనపు ఎస్పీ సత్యనారాయణ

డ్రగ్స్, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన

ఆలేరు నవంబర్ 12(ప్రజా జ్యోతి)
రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, మంగ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి యువ సమ్మేళనం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ సత్యనారాయణ , యాదగిరిగుట్ట డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను





విపరిస్తూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ, ఈవ్ టీజింగ్ అనేది తీవ్రమైన నేరమని, మహిళలు మరియు బాలికలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. తోటి విద్యార్థినులను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.
విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకొని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాధ్యతగల పౌరులుగా ఎదగాలని వారు సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతలో డ్రగ్స్ నిర్మూలన, మహిళల పట్ల గౌరవం, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పోలీసు అధికారులకు, విద్యాసంస్థల ప్రతినిధులకు, విద్యార్థులకు, యువతకు రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ మరియు మంగ ఫౌండేషన్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో యాదగిరి గుట్ట సిఐ శంకర్ గౌడ్, ఆలేరు ఎస్ హెచ్ ఓ కిరణ్ కుమార్, ఎస్ ఐ వినయ్, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, పులిపలుపుల మహేష్, మంగ ఫౌండేషన్ అధ్యక్షులు మంగ నరసింహులు, కౌన్సిలర్ లు పాశికంటి సంపత్, బీజని కళ్యాణి మధు, బబ్బురి పోశెట్టి ,సీసా సత్తయ్య,మంగ అరవింద్, ఐలి సందీప్, కళ్లెం జితేందర్, మొరిగాడి సిద్దులు కంతుల శంకర్, వడ్డెమాను నరేందర్, ఎలాగల వెంకటేష్, ఫయాజ్, మహమూద్, ఐలి భార్గవ్, ఎలగల శివ తదితరులు పాలుగొన్నారు.

వరుస దొంగతనాల గుట్టురట్టు!

- మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అరెస్ట్
- 29.7 తులాల వెండి ఆభరణాలు, రెండు ఫోన్లు స్వాధీనం
- డీఎస్పీ వితల్ రెడ్డి వెల్లడి



బాన్సువాడ, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల ఆటకు బాన్సువాడ పోలీసులు చెక్ పెట్టారు. పట్టణంలోని మూడు ఇళ్లలో జరిగిన చోరీ కేసులను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 29.7 తులాల వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాన్సువాడ డీఎస్పీ పి. వితల్ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.

సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు

బాన్సువాడ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అక్టోబర్ 26న రెండు ఇళ్లలో, నవంబర్ 4న హరిజనవాడలో మరో ఇంట్లో దొంగతనాలు జరిగాయి. అర్ధరాత్రి వేళ ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదులతో పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డీఎస్పీ వితల్ రెడ్డి పర్యవేక్షణలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి. శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

బస్టాండ్ వద్ద చిక్కిన నిందితుడు

నవంబర్ 11న బాన్సువాడ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న జాదవ్ రాహుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. దొంగిలించిన సొత్తులో కొంత బోధన్‌కు చెందిన సందీప్‌కు విక్రయించినట్లు, మిగిలిన సొత్తును జుక్కల్ ప్రాంతంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు విచారణలో తెలిపాడు. రాహుల్ గతంలోనూ దొంగతనాలకు పాల్పడి జైలు జీవితం గడిపినట్లు పోలీసులు వెల్లడించారు. జల్సాలు, అప్పుల కారణంగా దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించారు.

దొంగ సొత్తు రికవరీ

నిందితుల నుంచి 29.7 తులాల వెండి ఆభరణాలతో పాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన జాదవ్ రాహుల్ (సిద్దాపూర్ తాండ, జుక్కల్ మండలం; ప్రస్తుతం భైంసా), కనోజ్వార్ సందీప్ (49, బోధన్)లను రిమాండ్ నిమిత్తం బిచ్కుంద కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ కేసుల ఛేదనలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి. శ్రీధర్, ఎస్ఐ శిరీష, క్లైమ్ టీం హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, కానిస్టేబుళ్లు పృథ్వీకుమార్, పాండురంగ, సుదర్శన్ రావు కీలకంగా వ్యవహరించారు. వారి కృషిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.

కమ్మర్‌పల్లి బైపాస్ వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్కింగ్‌లు!

- భీమ్‌గల్ రహదారిపై గుర్తింపు పనులు
- పెర్కిట్ నుంచి జగదల్‌పూర్ వరకు ప్రతిపాదిత జాతీయ రహదారి

కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) నవంబర్ - 12 : పెర్కిట్ నుంచి జగదల్‌పూర్ వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి క్షేత్రస్థాయిలో గుర్తింపు పనులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా భీమ్‌గల్ రహదారిపై కమ్మర్‌పల్లి సమీపంలో పసుపు రంగుతో జాతీయ రహదారికి సంబంధించిన మార్కింగ్‌లు వేయడం స్థానికంగా ఆసక్తిని కలిగిస్తోంది. ఈ మార్కింగ్‌లు కమ్మర్‌పల్లి బైపాస్ మార్గానికి సంబంధించినవిగా తెలుస్తోంది.ప్రస్తుతం కమ్మర్‌పల్లి గ్రామం మధ్య నుంచే జాతీయ రహదారి కొనసాగుతోంది. దీంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ముఖ్యంగా భారీ వాహనాలు గ్రామం గుండా ప్రయాణించడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే పరిస్థితులు ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా కమ్మర్‌పల్లి బైపాస్ మార్గం ఏర్పాటు కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

బైపాస్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం!



కమ్మర్‌పల్లి వెలుపల నుంచి బైపాస్ రహదారి అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు గ్రామంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదు. దీంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. రోడ్డు ప్రమాదాల ముప్పు తగ్గే అవకాశం కూడా ఉంది.

రవాణా రంగానికి మరింత ఊతం

పెర్కిట్ నుంచి జగదల్‌పూర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే ఉత్తర తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వ్యాపార కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి ఈ రహదారి ఉపయోగపడనుంది. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. భీమ్‌గల్ రహదారిపై కనిపిస్తున్న మార్కింగ్‌లతో బైపాస్ నిర్మాణంపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. అయితే హైవే అలైన్‌మెంట్, భూసేకరణ, నిర్మాణ పనుల ప్రారంభం తదితర అంశాలపై సంబంధిత అధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

సుమారు 240 ఫీట్ల వెడల్పుతో మార్కింగ్

కమ్మర్‌పల్లి బైపాస్ మీదుగా వెళ్లనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం అధికారులు సుమారు 240 ఫీట్ల వెడల్పుతో మార్కింగ్ చేపట్టారు. రహదారి నిర్మాణానికి సంబంధించి భూముల విస్తీర్ణాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ మార్కింగ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో హైవే నిర్మాణానికి సంబంధించిన పనులపై స్థానికంగా చర్చ మొదలైంది.

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే డా ఆర్ భూపతి రెడ్డి

ఇందల్వాయి(ప్రజా జ్యోతి) నవంబర్. 12 ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్ ప్రారంభించారుపాఠశాల అభివృద్ధికి రూ.6 కోట్లు, ప్రాంత అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయింపు

విద్యార్థుల కోసం నాలుగు ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తా

విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా తదితర అన్ని రంగాల్లో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలకే పరిమితం కాకుండా సమాజంతో మమేకమై తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.గురువారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా రంగాల్లో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని







పిలుపునిచ్చారు. ఏకలవ్య పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం రూ.6 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా పాఠశాల నుంచి మాక్లూర్ తండా వరకు రహదారి నిర్మాణంతో పాటు ఈ ప్రాంతంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మరో రూ.11 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు.

పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది విజ్ఞప్తి మేరకు విద్యార్థులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించేందుకు నాలుగు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించి, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.విద్యార్థులు విద్యలోనే కాకుండా కళలు, సంస్కృతి, క్రీడలు, సామాజిక సేవ వంటి వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత దిలీప్ పాఠశాల ఉపాధ్యాయులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వినూత్న కార్యక్రమం

- మహిళల ఇళ్ల వద్దకే వెళ్లి రూపే (రూపాయి) ఏటీఎం కార్డుల పంపిణీ

జహీరాబాద్ నవంబర్ 12(ప్రజా జ్యోతి న్యూస్) డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కాకతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ జహీరాబాద్ బ్రాంచ్ ఒక విశేష మైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేసేందుకు అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి రూపే (రూపాయి) ఏటీఎం డెబిట్ కార్డులను అందజేశారు. మహిళలు బ్యాంకుకు వచ్చే అవసరం లేకుండా, వారి ఇళ్ల వద్దకే వెళ్లి స్వయంగా బ్రాంచ్ మేనేజర్ చేతుల మీదుగా ఈ కార్డులను పంపిణీ చేయడం విశేషం. మహిళల్లో డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచడానికి, ఏటీఎం కార్డుల ద్వారా నగదు ఉపసంహరణ. ఆన్‌లైన్ పేమెంట్స్ సులభంగా చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

సైబర్ భద్రతపై అవగాహన.



కార్డులను అందజేసే సమయంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి మహిళలకు డిజిటల్ సేవలపై కీలక సూచనలు చేశారు. ఏటీఎం కార్డుల వినియోగం, పిన్ (ర్×చీ) నంబర్ భద్రతగా ఉంచుకోవడం, మరియు ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన లబ్ధి దారులకు క్షుణ్ణంగా వివరించారు. బ్యాంక్ సిబ్బంది తీసుకున్న ఈ చొరవపై స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సంక్షోభం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ నరోత్తం
- పరిశ్రమలకు నీటి సరఫరా నిలిపివేసి ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

జహీరాబాద్ నవంబర్ 12(ప్రజా జ్యోతి న్యూస్) నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని జహీరాబాద్ కు రోజుకు సుమారు 40 ఎంఎల్డీ (ఎం ఎల్ డి)(4 కోట్ల లీటర్లు)తాగు నీరు అవసరం ప్రస్తుతం బుసిరెడ్డి పల్లి, రాఘవాపూర్, పాంపాడ్ ప్రాంతాల నుంచి సింగూరు జలాశయం ఆధారంగా నీటి సరఫరా జరుగుతోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మరో 15--20 రోజుల్లో ఈ నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉందని, ఆ తర్వాత భూగర్భ జలాలపైనే ప్రధానంగా ఆధారపడాల్సి వస్తుందని అన్నారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడం ఒక కారణమైతే, సింగూరు జలాశయంలోని నీటిని ముందస్తు ప్రణాళిక లేకుండా ఖాళీ చేయడం,గోదావరి జలాలను సకాలంలో ఎత్తి పోసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శన మన్నారు దాదాపు 850 టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వృథాగా వెళ్లిపో యాయని, వాటిని సద్వినియోగం చేసుకోవ డంలో ప్రభుత్వం విఫల మైందని ఆరోపించారు. జహీరాబాద్ లోని అలానా, హాట్సన్ తదితర ప్రధాన పరిశ్రమలకు రోజుకు సుమారు 3 ఎంఎల్డీ నీటిని వినియో గిస్తున్నట్లు అంచనా. ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లో పరిశ్ర మలకు నీటి సరఫరాను తక్షణమే నిలిపి వేయాలి.ఆ



పరిశ్రమలు వినియోగిస్తున్న బోర్లపై సమగ్ర విచారణ జరిపి,అవసరమైతే చట్టప్రకారం వాటిని స్వాధీనం చేసుకుని ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాలి. అలానా, హాట్సన్ తదితర పరిశ్ర మలకు తాగునీటి వనరుల నుంచి నీటి సరఫరాను నిలిపివేసి, వాటి భూగర్భ జల వినియోగంపై విచారణ జరపాలి. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. పరిశ్రమల ప్రయోజనాల కంటే ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, తాగునీటి అవసరాలకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.నీరు సమృద్ధిగా ఉన్న బోర్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని చర్యలు చేపట్టకపోతే జహీరాబాద్ ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ చంద్రా రెడ్డి, శివకుమార్, యం.డి. సలీమ్, కీరు లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పీఠం... స్థానిక నాయకత్వానికి పట్టం కడతారా?

- జోగిపేట రాజకీయాల్లో ప్రవీణ్ కుమార్ పేరు చుట్టూ చర్చ
- బీసీ వర్గానికి అవకాశం కల్పించాలంటున్న స్థానిక నేతలు.. మంత్రి నిర్ణయంపై ఉత్కంఠ

అందోల్, నవంబర్ 12, (ప్రజాజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీలో సామాజిక సమీకరణాలకే కాదు.. స్థానికంగా నాయకుడికి ఉన్న ప్రజాదరణ, రాజకీయ బలానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే చర్చ ఇప్పుడు జోగిపేట కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎవరికి కట్టబెడతారన్న అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, అందరి దృష్టి పట్లోళ్ల ప్రవీణ్ కుమార్ వైపు మళ్లుతోంది. పట్టణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు



సంపాదించుకున్న ఆయనకు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు, యువత, పట్టణ ప్రముఖుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

ప్రజాబలమే ప్రధాన అర్హతగా..

జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ తరపున రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన పట్లోళ్ల రేఖా--ప్రవీణ్ కుమార్ దంపతులకు స్థానిక రాజకీయాల్లో మంచి పరిచయాలు ఉన్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించడం ప్రవీణ్ కుమార్‌కు ఉన్న ప్రజాదరణకు నిదర్శనంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల్లో కనిపించే నాయకుడిగా కాకుండా, వార్డులో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరించడం ఆయనకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న స్థానిక నాయకుడికి మార్కెట్ కమిటీ బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ



జనరల్ కేటగిరీకి కేటాయించడంతో ఆశావహుల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. బీసీ వర్గానికి చెందిన పట్లోళ్ల ప్రవీణ్ కుమార్‌కు అవకాశం కల్పిస్తే సామాజిక ప్రాతినిధ్యంతో పాటు జోగిపేట పట్టణ కాంగ్రెస్ నాయకత్వానికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని స్థానికులు అంటున్నారు. పట్టణ స్థాయిలో పార్టీకి అండగా ఉన్న నాయకుడికి నామినేటెడ్ పదవి దక్కితే భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

పట్టణానికి ప్రాతినిధ్యం దక్కేనా?

మార్కెట్ కమిటీ పరిధిలో అందోలు, టేక్మాల్, చౌటకూర్, పుల్కల్, హత్నూర మండలాలు ఉండటంతో ఆయా ప్రాంతాల నుంచి పలువురు నాయకులు చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఐదు మండలాల మధ్య సామాజిక, రాజకీయ సమతుల్యతను పాటించడం అధిష్ఠానానికి కీలకంగా మారింది. ఈ క్రమంలో జోగిపేట పట్టణానికి ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ కూడా తెరపైకి వస్తోంది. పట్టణంలో పార్టీకి ఉన్న కేడర్‌ను సమన్వయం చేయగల నాయకుడిగా ప్రవీణ్ కుమార్ పేరును స్థానిక శ్రేణులు ముందుకు తెస్తున్నాయి.

మంత్రి నిర్ణయమే కీలకం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సన్నిహితుడిగా ఉన్న పట్లోళ్ల ప్రవీణ్ కుమార్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కుతుందా? ఐదు మండలాల ఆశావహుల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారు? స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తారా? సామాజిక సమీకరణాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. స్థానికంగా తనకు ఉన్న ప్రజాబలం, పార్టీతో కొనసాగుతున్న అనుబంధం, బీసీ సామాజిక నేపథ్యం ప్రవీణ్ కుమార్‌కు అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. అయితే తుది ఎంపికపై మంత్రి దామోదర రాజనర్సింహ తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. జోగిపేట మార్కెట్ కమిటీ పీఠం స్థానిక నాయకుడికి దక్కుతుందా? ప్రవీణ్ కుమార్ ఆశలు నెరవేరుతాయా? అన్నది ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిని రేపుతోంది.





వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ధ్వంసం: నిరసన ర్యాలీ

♦ ఈ నెల 14న నర్సాపూర్‌లో శాంతియుత నిరసన.. విగ్రహ పునఃప్రతిష్ఠ



నవంబర్ 12 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం చిన్న చింతకుంట గేట్ సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 9వ తేదీన కలియుగ కాలజ్ఞానాన్ని రచించిన మహానుభావుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ శనివారం నర్సాపూర్‌లో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం పెద్దలు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి మెదక్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల పెద్దలు, వివిధ సంఘాల అధ్యక్షులు, యువ నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. స్వామివారి విగ్రహ ధ్వంసం ఘటనపై నిరసన తెలియజేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల నాయకులు, భక్తులు, కుల పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని శ్రీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నర్సాపూర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

♦ తడకపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సిద్దిపేట అర్బన్, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):- రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తడకపల్లి గ్రామ సర్పంచ్ తొడెంగల వెంకట్ ముదిరాజ్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం అనకాపల్లి గ్రామంలో పిఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధర పొందాలని సూచించారు. రైతు సంక్షేమం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లిమెల్లి నరేందర్, వార్డు మెంబర్లు, పంచాయతీ పాలకవర్గం రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

♦ ఎన్సాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సిద్దిపేట అర్బన్, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):- రైతుల సౌకర్యార్థం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్సాన్ పల్లి గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్ గౌడ్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా నేరుగా మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కట్కూరి సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల హక్కుల కోసం ఉద్యమించాలి

♦ దుబ్బాక మండల బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ నాయకుల పిలుపు



దుబ్బాక నవంబర్ 12 (ప్రజా జ్యోతి) ఈనెల 20వ తారీఖున దుబ్బాక మండల ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల బహుజన నాయకులు అందరూ పిలుపునివ్వడం జరిగింది. గురువారం రోజున మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట అవార్డులో బీసీ సంఘాల నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో హక్కుల సాధన కోసం అదేవిధంగావెనుకబడిన వర్గాల ప్రజలకు తమ హక్కుల కోరకై తమ ఆత్మగౌరవ సామాజిక మనత్వ న్యాయం కోసం ఉద్యమించవలసిన అవసరము ఎంతో ఉన్నదని తెలిపారు కావున దుబ్బాక మండల పరిధిలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రజలందరూ పార్టీలకతీతంగా ఈనెల 20 తారీఖున వైశ్య భవన్ దుబ్బాకలో జరిగేటువంటి సమావేశాన్ని విజయవంతం చేసి మన హక్కుల సాధనలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘంల నాయకులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత

♦ తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి

♦ రాంపూర్, కాన్గల్, లింగంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తొగుట, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తోందని తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్, కాన్గల్ , లింగంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాన్గల్ పిఏసిఎస్ చైర్మెన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి బుదవారం ప్రారంభించి రైతులనుద్దేశించి మాట్లాడుతూ తొగుట మండలంలోని రాంపూర్, కాన్గల్, లింగంపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని, రైతులకు అండగా నిలుస్తూ వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, రాంపూర్, లింగంపేట సర్పంచ్ లు రవీందర్, గొడుగు జయమ్మ నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, ఉపాధ్యక్షులు మజ్జిగ వెంకట్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఆన్సర్, గ్రామ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కృష్ణ, నాయకులు వెంకటేశం, కొండల్ రెడ్డి, బషీర్, పీఏసీఎస్ సీఈఓ గంగారెడ్డి, సిబ్బంది శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బాల్యాన్ని కాపాడుకుందాం.. బాలల భవిష్యత్తుకు భరోసా కల్పిద్దాం

♦ బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, సోషల్ మీడియా ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన





వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 12: చిన్నారుల హక్కుల పరిరక్షణ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే తీవ్ర పరిణామాలు, బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులు, వివిధ రకాల దుర్వినియోగాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను తెలియజేస్తూ, బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ల వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అవసరానికి మించి మొబైల్ వినియోగించడం, సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా పోక్సో చట్టం గురించి వివరిస్తూ, బాలలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు చట్టంలో ఉన్న నిబంధనలు, బాలల హక్కులు, ఫిర్యాదు చేసే విధానాలను తెలియజేశారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ విద్యపై దృష్టి సారించాలని వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలలపై వేధింపులకు అడ్డుకట్ట వేయడం, ప్రతి విద్యార్థికి భద్రమైన వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా కోఆర్డినేటర్లు సంతోషి, సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు బీవీఆర్ఐటీ వేదిక

♦ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన ♦ బీవీఆర్ఐటీలో ప్రయోగశాలల సందర్శన





వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 12: మెదక్ జిల్లా వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, సాంకేతిక రంగంలో నూతన ఆలోచనలకు పునాది వేయాలనే లక్ష్యంతో ఈ క్షేత్రస్థాయి పర్యటన, ఐడియా క్రియేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన డైస్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కార్యాచరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు బీవీఆర్ఐటీలోని ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్, విష్ణు వెంచర్ ల్యాబ్స్ ఫౌండేషన్ ఇంక్యుబేషన్ సెంటర్లను సందర్శించి అక్కడి ఆధునిక సాంకేతిక సదుపాయాలను పరిశీలించారు.కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి సరికొత్త పరిష్కారాలను ఎలా రూపొందించవచ్చనే అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. తమ ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు ప్రోటోటైప్ నమూనాలను తయారు చేసే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ ఇన్‌చార్జి డా. వి. మురళీకృష్ణ డిజైన్ థింకింగ్, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రయోగాత్మక విద్యపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎఐఖీ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ రోహిత్ కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం, వాటిని నమూనాలుగా అభివృద్ధి చేయడం, స్టార్టప్‌ల ఏర్పాటులో ఇంక్యుబేషన్ కేంద్రాల ప్రాధాన్యతను తెలియజేశారు.ఈ పర్యటన విద్యార్థులకు సాంకేతిక రంగంపై ఆసక్తిని పెంచడమే కాకుండా, భవిష్యత్తులో తమ ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలనే స్ఫూర్తిని అందించింది.కార్యక్రమ నిర్వహణలో బీవీఆర్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్లు డా. పి. చంద్రబాబు, డా. కె. శ్రీనివాసరావు సమన్వయ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నిలువెత్తు నిర్లక్ష్యం...









♦ డంప్ యార్డును తలపిస్తున్న ఎంపీడీఓ ఆఫీసు

♦ అధికారులు మారిన బోర్డులపై పేర్లు మారవా

♦ మహిళలకు పురుషులకు ఒకే మరుగుదొడ్డి

♦ సంచుల్లో పేరుకుపోయిన చెత్త

చిన్నకోడూరు, నవంబర్12, (ప్రజాజ్యోతి):- పరిశుభ్రతకు కేంద్రబిందువుగా ఉండాల్సిన ఎంపీడీఓ కార్యాలయంలో నిలువెత్తు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అధికారుల అలసత్వం కారణంగా కార్యాలయ ప్రాంగణం కనీస నిర్వహణకు నోచుకోక అస్తవ్యస్తంగా మారింది.పాలనను గాడిలో పెట్టాల్సిన యంత్రాంగమే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపం,మండల అధికారుల అలసత్వం కారణంగా కార్యాలయ ఆవరణ అధ్వాన్నంగా తయారైంది.అధికారులు మారుతున్నా కార్యాలయంలోని బోర్డులపై మాత్రం పాత అధికారుల పేర్లే ఉండటంపట్ల పరిషత్ కార్యాలయ పర్యవేక్షణ ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతుంది. కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశాలు జరగటం పరిపాటి. అదేవిధంగా ఆయా పనుల నిమిత్తం కార్యాలయంకు వచ్చే ప్రజలకు సైతం తిప్పలు తప్పటం లేదు.కనీస మౌలిక వసతులు కూడా కరువయ్యాయి. ముఖ్యంగా మహిళలు, పురుషులకు వేర్వేరు మరుగుదొడ్లు లేకపోవడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది.అందరికీ కలిపి ఒకే మరుగుదొడ్డి ఉండటం అది కూడా సరైన నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారడం, దుర్వాసనతో మహిళా ప్రజాప్రతినిధులు,మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయంలోనేఇలాంటి దుస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది. ఉద్యోగాలకు వస్తున్నామా వెళ్తున్నామా అన్నట్టే వ్యవహరిస్తున్నారు తప్ప సంచులకొద్దీ పేరుకుపోయిన చెత్త అధికారులకు కనిపించడం లేదా అంటూ ప్రజలు అధికారుల తీరుపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కార్యాలయమే ఇలా చెత్తతో నిండిపోయి ఉంటే గ్రామాల అభివృద్ధి పట్ల అధికారుల తీరు ఎలా ఉంటుందో అర్థం అవుతుంది అంటూ ఇప్పటికే విమర్శలు లేకపోలేదు. నీతులు చెప్పేందుకేనా అధికారులు ఆచరించేందుకు కాదా అన్నట్లుగా సాగుతున్న అధికారుల తీరుపై కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని, కార్యాలయ ఆవరణను శుభ్రపరిచి కనీస వసతులు కల్పించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్ డ్ వేతనం ఇవ్వాలి

♦ డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మె

♦ దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో వినతి పత్రం అందజేత

♦ సిఐటియు జిల్లా కోశాధికారి భాస్కర్



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 12 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆశా వర్కర్ 18 వేల ఫిక్స్ వేతనం అందిస్తామని చెప్పి నేటికీ ఆశ వర్కర్లకు ఇవ్వకపోవడం సరైనది కాదని సిఐటియు కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. గురువారం రోజున ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆశ వర్కర్లకు ఫిక్స్ డు వేతనం 18 వేల రూపాయలు నిర్ణయించాలని పీఎఫ్,ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లు నిరంతరం బడుగు,బలహీన వర్గాల ప్రజలకు సేవలందిస్తున్నారనీ గర్భిణీలు ఆసుపత్రిలో డెలివరీ అయ్యే విధంగా చూస్తూ తల్లి,బిడ్డ ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నారనీ తెలిపారు. సీజనల్, వ్యాధులు, అంటువ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఏఎన్సీ, పిఎన్సి, టార్గెట్స్, ఎన్సిడి ఆన్లైన్ సర్వే, స్ఫూటమ్ డబ్బాలను మోయడం,ఎగ్జామ్ డ్యూటీలు, డ్రైడే, ఫ్రైడే లెప్రసీ, పల్స్ పోలియో తదితర అనేక పనులు ప్రతి రోజూ నిర్వహిస్తున్న వీరికి ప్రభుత్వం అమలు ఎలాంటి వేతనం అందించ కపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలనీ, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని , పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలానారు. డిమాండ్ ల పరిష్కారం కొరకు 2026 డిసెంబర్ 15 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ, ఆశ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కోశాధికారి ఎష్ట్ర, భాగ్యలక్ష్మి, భాలమణి, కవిత, శారద, లత, సంతోషి, చంద్రకళ, స్వరూప, లావణ్య, లక్ష్మి, వెంకటమణుక, అరుణ, నవనీత, పొచవ్వ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మహిళలు, బాలల భద్రతపై షీ టీమ్ అవగాహన

గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన

పరిగి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
పరిగి మండల పరిధిలోని డాక్టర్ జగన్మోహన్ స్కూల్‌లో పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళలు, బాలల భద్రతపై అవగాహన



కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సింలు, సిబ్బంది సావిత్రి, శోభ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, మానవ అక్రమ రవాణా, జెండర్ ఈక్వాలిటీ, జెండర్ సెన్సిటివిటీ వంటి అంశాలను వివరించారు. అలాగే అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని, షీ టీమ్ సేవల కోసం 181 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే 1930, బాలల సహాయం కోసం 1098, మాదకద్రవ్యాల నిర్మూలనకు 1908 నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత, కమ్యూనిటీ పోలీసింగ్, మద్యపాన నిషేధం, ట్రాఫిక్ నిబంధనలు, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలల భద్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. కృష్ణయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లగొండలో అఖిల భారత కిసాన్ జాతీయ మహాసభ

నవంబర్ 15న మహా ప్రదర్శన, మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

బహిరంగ సభను జయప్రదం చేయాలి: వెంకటయ్య

పరిగి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను పురస్కరించుకుని పరిగి పట్టణంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య మాట్లాడుతూ, నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ



పట్టణంలో నిర్వహించనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. రైతుల ఉద్యమ ఫలితంగా రద్దయిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన మళ్లీ అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట నష్టపరిహారం, ఉచిత పంటల బీమా అమలు చేయాలని, బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని రైతు సంఘం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు నల్లగొండలో ఈ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 15న మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లగొండ మర్రిగూడెం బైపాస్ నుంచి ఎన్జీ కళాశాల మైదానం వరకు నిర్వహించే మహా ప్రదర్శనలో, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే బహిరంగ సభలో పరిగి ప్రాంత రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎం. వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. హబీబ్, హెచ్. సత్తయ్య, రఘురాం, నరసింహులు, వెంకటయ్య, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌లో భారత జెండా ఎగురవేయనున్న వెల్చాల్ ముద్దుబిడ్డ!

మోమిన్‌పేట్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి)
గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగినా ప్రతిభకు



సరిహద్దులు ఉండవని నిరూపిస్తున్నాడు వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం వెల్చాల్ గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు మహ్మద్ అయాన్. షూట్‌బాల్ క్రీడలో తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి ఎంపికై గ్రామంతో పాటు వికారాబాద్ నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచాడు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నేపాల్ రాజధాని ఖాట్మండులో నిర్వహించనున్న తొలి అంతర్జాతీయ షూట్‌బాల్ ఎమర్జింగ్ కప్ టోర్నమెంట్‌లో భారతదేశం తరఫున మహ్మద్ అయాన్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. దేశవ్యాప్తంగా ఈ పోటీలకు 12 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారుడిగా అయాన్ ప్రత్యేక గుర్తింపు సాధించాడు. తెలంగాణ నుంచి ఈ అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ నేపథ్యంలో గురువారం అయాన్ తన తండ్రి మహ్మద్ షాబుద్దీన్‌తో కలిసి వెల్చాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయాన్‌ను అభినందించి అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. ఈ నెల 18న నేపాల్‌కు బయలుదేరనున్న అయాన్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. తన నియోజకవర్గంలోని క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నేపాల్ వేదికగా జరిగే అంతర్జాతీయ పోటీల్లో అయాన్ తన ప్రతిభను చాటుకుని భారతదేశంతో పాటు తెలంగాణ, వికారాబాద్ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. తమ కుమారుడిని అభినందించి ఆశీస్సులు అందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మహ్మద్ షాబుద్దీన్, విజయ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రతిభకు అంతర్జాతీయ వేదికపై అవకాశం లభించడం వెల్చాల్ గ్రామానికే కాదు, యావత్ వికారాబాద్ జిల్లాకు గర్వకారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్,మాజీ సర్పంచ్ ఇబ్రహీం, తాత నజీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న పట్టభద్రుల ఎన్నికలలో బిజెపి గెలిపి లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీని సంస్థాగతంగా బూతు స్థాయి నుండి బలోపేతం చేయాలి

బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి

శంషాబాద్ లో బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం

పాల్గొన్న బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి, ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి)
రానున్న పట్టభద్రుల ఎన్నికలలో బిజెపి గెలిపి లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి శంషాబాద్





మండలం సుల్తాన్ పల్లిలోని బ్యూటీ గ్రీన్ పార్క్ రిసార్ట్ లో బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ,జిల్లా ఇన్చార్జ్ రఘునాథరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారం రావాలంటే పార్టీ గ్రామస్థాయి నుంచి బిజెపి నిర్మాణం జరగాలని సమిష్టిగా పనిచేస్తేనే పార్టీ అభివృద్ధి చెందుతుందని జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా, మాజీ ఎమ్మెల్యే కేస రత్నం, మాజీ జిల్లా అధ్యక్షులు మెదక్ జిల్లా ఇంచార్జి బొక్క నర్సింహారెడ్డి, బస్వా పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, వివిధ జిల్లాల ఇంచార్జి లు శ్రీవర్ధన్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, సేవెల్ల మహేందర్, శ్రీధర్ , రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, అందేలా శ్రీరాములు యాదవ్, శ్రీశైలం యాదవ్, శంకర్ రెడ్డి, బుక్క వేణు గోపాల్, అందే బాబయ్యా, ధీరజ్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నారాయణ యాదవ్, జ్ఞానేశ్వర్, జిల్లా బీజేపీ వివిధ మోర్చ ల అధ్యక్షులు, మమత రెడ్డి, అభినయ్ గౌడ్, సుదర్శన్ యాదవ్, నర్సింహ, మోహన్ సింగ్ నాయక్, బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ సాధ మల్లారెడ్డి, శంషాబాద్ డివిజన్ అధ్యక్షులు వంశీ యాదవ్, జిల్లా లోని మండల డివిజన్ అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ లో 200 కోట్ల ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణకు యత్నం

ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్

రాజేంద్రనగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి)
ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు





కొనమొల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నెం. 626/1 లో గల సుమారు 17 ఎకరాల ప్రభుత్వ భూమి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దాదాపు 200 కోట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని వారి నుండి ప్రభుత్వ భూమి నుండి కాపాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని గురువారం కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఆర్డిఓ శ్రీధర్, శంషాబాద్ మండలం డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ ప్రభుత్వ భూమిలో దాదాపు ఒకటి నుండి రెండు ఎకరాల భూమిని అక్రమంగా కొనుగోలు చేసినట్లుగా, అంతటితో ఆగకుండా మిగిలిన ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తురు.కావున ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని అన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా నమోదు చేసుకుని, ఆక్రమిస్తున్నారని ఎవరైనా అడిగితే బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ప్రభుత్వ భూమిని భవిష్యత్తులో ఎవరూ ఆక్రమించకుండా అధికారిక సర్వే ఆధారంగా హద్దులు నిర్ణయించి, ప్రభుత్వ భూమి అని సూచించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయగలరు.ఇప్పటికే అక్రమ ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం వాటిని తొలగించి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుచ్చి రెడ్డి, జయసింహ, పరంధాములు, రాజేందర్, మురళి గౌడ్, హనుమంతు ముదిరాజ్, రాచమల్ల రమేష్, దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద సీఎంసి అధికారులకు ఒకరోజు సామర్థ్య అభివృద్ధి శిక్షణ

శేరిలింగంపల్లి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పరిపాలనా మరియు మున్సిపల్ అధికారుల కోసం ఒకరోజు సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నవంబర్ 12, 2026న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో నిర్వహించింది. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మున్సిపల్ అధికారుల సంస్థాగత సామర్థ్యం, పరిపాలనా సామర్థ్యం,సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ శిక్షణ



కార్యక్రమాన్ని డాక్టర్ ఎన్. రమేష్ కుమార్,ఐఏఎస్ (రిటైర్డ్), డైరెక్టర్ జనరల్, ఏ ఎస్ సి ఐ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఐఏఎస్, డాక్టర్ ఎన్. జనార్దన్ రెడ్డి, ఐఏఎస్ (రిటైర్డ్), డీన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్ మరియు సెంటర్ డైరెక్టర్, ఏ ఎస్ సి ఐ సమక్షంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సీఎంసి కి చెందిన జోనల్ కమిషనర్లు,అదనపు కమిషనర్లు,ఇంజినీరింగ్ విభాగ అధికారులు,టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు,డిప్యూటీ కమిషనర్లు,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.పట్టణ పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి మున్సిపల్ అధికారుల వృత్తిపరమైన పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు మరియు పరిపాలనా సామర్థ్యాలను పెంపొందించడంపై ఈ శిక్షణలో ప్రధానంగా దృష్టి సారించారు.పట్టణ పాలనను బలోపేతం చేయడం,అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం,పట్టణ పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ సేవలను మెరుగుపరచడం పట్ల సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తుంది.



మోమిన్‌పేట్‌లో ఘనంగా అరవింద్ సివిల్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ కార్యాలయం ప్రారంభం!

నూతన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన యువ ఇంజనీర్ అరవింద్‌కు ప్రముఖుల అభినందనలు

మోమిన్‌పేట్: నవంబర్ 12 ప్రజా జ్యోతి):
వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో దుర్గంచెరువు గ్రామానికి చెందిన యువ సివిల్ ఇంజనీర్ అరవింద్ నూతనంగా



ఏర్పాటు చేసిన సివిల్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రారంభోత్సవం సందడిగా సాగింది. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా తమ విద్య, నైపుణ్యంతో స్వయం ఉపాధి రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. నాణ్యమైన నిర్మాణ సేవలతో ప్రజల నమ్మకాన్ని సంపాదించి వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శంకర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని అరవింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం సమాజ అభివృద్ధికి శుభపరిణామం అని కొనియాడారు.

శంషాబాద్ లో కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కారుకు ప్రమాదం

తృటిలో తప్పిన పెను ప్రమాదం

రాజేంద్రనగర్, నవంబర్ 12 (ప్రజా జ్యోతి)
టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న కాకా చిత్రంలో పాట చిత్రీకరణ ముగించుకుని తిరిగి వస్తుండగా శంషాబాద్ మండల పరిధిలో ఆయన ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి ఓ మినీ ట్రక్కు



డీకొట్టింది. వివరాల్లోకి వెళితే వెజిటెబుల్ లోడ్ వేగంగా ఓ మినీ ట్రక్కు ఒక్కసారిగా అదుపుతప్పి శేఖర్ మాస్టర్ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతిన్నది. అయితే, అదృష్టవశాత్తు శేఖర్ మాస్టర్‌కు స్వల్ప గాయాలు కాగా.. కారులో ఉన్న మిగిలిన వారికి ఎలాంటి పెద్ద గాయాలు కాలేదు. దీంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటం ప్రాణనష్టం జరగడం ఆయన కటుంబ సభ్యులు, సినీ పరిశ్రమ వర్గాలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

వాటర్ ట్యాంకర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):
గురువారం 12.11.2026 మధ్యాహ్నం సుమారు 02:00 గంటల సమయంలో ఏ.రాజ్‌కుమార్ 40 సం.లు తన హోండా యాక్టివా టి ఎస్15 ఎఫ్ పి 0112 వాహనంపై గచ్చిబౌలి నుండి పటాన్‌చెరు వైపు వెళ్తున్న క్రమంలో, నల్లగండ్ల ఫ్లైఓవర్ సిగ్నల్ వద్ద పక్క నుండి టిఎస్ 08 యుఏ 8274 నంబర్ గల వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం గ నడిపి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ అనే వ్యక్తి గాయపడ్డారు ఆసుపత్రి కి తీసుకుపోయే సరికి మృతి చెందడం జరిగింది. రాజ్ కుమార్ అనే వ్యక్తికి ఇద్దరు కుమారులు ఒక్కరు 9 సంవత్సరాలు, ఇంకొకరు 5 సంవత్సరాలు ఈయన సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా తెలిసింది. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక

తైక్వాండో, కబడ్డీ విభాగాల్లో ముగ్గురు విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు క్రీడారంగంలో



ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండో విభాగంలో వాసరి హారిక, కల్వ రోషిణి ఎంపిక కాగా, కబడ్డీ విభాగంలో ఎర్రవెల్లి అభినయశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో మరిన్ని విజయాలు సాధించి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్య రెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, డిఫెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, ఫిజికల్ అడ్వైజర్ లెంకల మహిపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌తోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

భూముల రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి

ముంపు గ్రామా తరలింపును మూడు నెలల్లో పూర్తి చేయాలి
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ధర్మారం, నవంబర్ 12, (ప్రజా జ్యోతి):
భూముల రీ సర్వేకు రైతులందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం ధర్మారం మండలం శాయంపేటలో జరుగుతున్న





భూముల రీ సర్వేను, చామనపల్లిలో నిర్వహిస్తున్న సోషల్ ఎకనామిక్ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను సరిచూసుకోవాలని కోరారు. సర్వేకు ముందే రైతులకు సమాచారం అందిస్తామని, పూర్తయిన తర్వాత వివరాలను గ్రామంలో ప్రకటించి అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇస్తామని తెలిపారు. రైతులు అందుబాటులో లేకపోతే జియో కోఆర్డినేట్ల ఆధారంగా జారీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాల విషయంలో ఇబ్బందులు తలెత్తవచ్చన్నారు. చామనపల్లిలో ప్రతి కుటుంబ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని, ముంపు గ్రామ తరలింపు ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచులు వేల్పుల రేవతి నాగరాజు, కూస శ్రీవాణి తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

కోటిలింగాల ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జగిత్యాల, నవంబర్ 12, ప్రజా జ్యోతి.
జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు, రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని, పూర్తయిన పనులను, ఇంకా చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, వైద్య సదుపాయాలు, భద్రత వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు సురక్షితంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఆలయ పునర్నిర్మాణంతో పాటు పుష్కరాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కోటిలింగాల పుణ్యక్షేత్రానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధి, గోదావరి పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మండల తహసీల్దార్, ఎంపీఓ, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



70 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా రీ సర్వే..

పట్టాదారుల సమస్యల పరిష్కారమే రీ సర్వేలో కీలకం!
అభ్యంతరాల సమయంలో క్షేత్రస్థాయిలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్ల పర్యటనలు
పట్టాదారులకు అవగాహన.. గ్రామాల్లో ముందస్తు ప్రచారం, ఫ్లాగ్ పోల్స్ ఏర్పాటు
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): భూముల రీ సర్వే అంటే కేవలం భూముల కొలతలు, హద్దుల నిర్ధారణకే పరిమితం కాకుండా.. ప్రతి పట్టాదారుడి సమస్యను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. రీ సర్వే అనంతరం అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు నేరుగా గ్రామాల్లో పర్యటించి భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, హద్దుల వివాదాలు, ఇతర రెవెన్యూ సమస్యలపై విచారణ జరిపి పరిష్కారం చూపాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 70 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా రీ సర్వే చేపడుతున్నట్లు. వివరించారు
ఈ మేరకు బుధవారం రాత్రి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ రావుతో పాటు పలువురు సంబంధిత అధికారులతో కలెక్టర్ రీ సర్వే ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే పురోగతి, తదుపరి కార్యాచరణ, అభ్యంతరాల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

27 గ్రామాల్లో సర్వే పనులు:

ఇప్పటికే 27 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,



తదుపరి దశలో 9(2) నోటీసుల జారీ వరకు తీసుకెళ్లేలా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. మరో 27 గ్రామాల్లోనూ సర్వే ప్రారంభించేందుకు ఆసక్తి ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లతో మరోసారి సమావేశం నిర్వహించి కొత్త బృందాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వచ్చే వారంలో అదనంగా 10 రోవర్లు అందుబాటులోకి వస్తే సర్వే పనులను మరింత విస్తరిస్తామన్నారు. ఇప్పటివరకు 21,114.29 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయిందన్నారు

పట్టాదారులకు అండగా ప్రత్యేక కార్యాచరణ:

రీ సర్వేలో పట్టాదారుల భాగస్వామ్యం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అభ్యంతరాల సమయంలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు గ్రామాలను సందర్శించి భూ విస్తీర్ణంలో తేడాలు, తక్కువ లేదా ఎక్కువ నమోదైన భూములు, సరిహద్దుల వివాదాలపై రెవెన్యూ విచారణ చేపట్టాలన్నారు. పట్టాదారులకు అవసరమైన సహకారం అందిస్తూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ, అభ్యంతరాల స్వీకరణపై ముందుగానే ప్రజలకు సమాచారం అందించేందుకు దప్పు చాటింపు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన చోట ఫ్లాగ్ పోల్స్ ఏర్పాటు చేసి, సర్వేకు సంబంధించిన ప్రక్రియను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులకు (జీపీఓ) కూడా ఈ అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించి, గ్రామస్థాయిలో ప్రజలకు సరైన అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన రీ సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.

సర్వేయర్లకు పారితోషికం.. భద్రతకు ప్రాధాన్యం:

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రతి 15 రోజులకు ఒకసారి పారితోషికం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వే సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని పాముకాటు వంటి ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే సేఫ్టీ బూట్లను కూడా సమకూర్చి నట్లు తెలిపారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పట్టాదారులకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతకు లబ్ధిదారుల గుర్తింపు పూర్తి:

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించ డంతోపాటు, వారికి సంబంధించిన ప్రొసీడింగ్స్ తయారీ ప్రక్రియను వేగవంతం చేసినట్లు వెల్లడించారు.ఇప్పటివరకు 50 శాతం ప్రొసీడింగ్స్ తయారీ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. త్వరలో సంబంధిత ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారు లకు ప్రొసీడింగ్స్ అందజేస్తామని, అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతా యని కలెక్టర్ తెలిపారు.

శిశు మందిర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణం

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా విద్యాబోధన. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్న శిశు మందిర్‌లు
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ బ్యూరో,నవంబర్ 12 (ప్రజాజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ ఎంతోమంది పేద విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతున్న సరస్వతీ శిశు మందిర్ విద్యాలయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి





అవలంబించడం దారుణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. విద్యాసంస్థల పట్ల రాజకీయ ధోరణితో వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన విభాగ్ స్థాయి సమావేశాలకు ఆయన హాజరై విద్యావేత్తలు, పాఠశాలల ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర వికాసం, విద్యా ప్రమాణాల పెంపు, ఆచార్యుల బాధ్యతలు, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. శిశు మందిర్ విద్యావిధానం చదువుతోపాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తోందని తెలిపారు. శిశు మందిర్‌లలో విద్యనభ్యసించిన ఎంతోమంది నేడు ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారని గుర్తుచేశారు.దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలకు శిశు మందిర్ విద్యాలయాలు పట్టుగొమ్మలని కొనియాడారు. సమాజానికి విలువలతో కూడిన విద్యను అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్న విద్యాసంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సింది పోయి చిన్నచూపు చూడటం సహించరానిదని అన్నారు.సమావేశంలో దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి పాల్గొని విద్యా సంబంధిత అంశాలు, విద్యార్థుల సమగ్ర వికాసం, ఆచార్యుల బాధ్యతలు, పాఠశాలల అభివృద్ధిపై మార్గదర్శనం చేశారు.ఈ కార్యక్రమంలో ముక్కాల సీతారాములు, పాక సత్యనారాయణ, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, తేళ్ల రాజమౌళి, ప్రధానోపాధ్యాయులు మోర రణదీర్, ఎలగందుల సత్యనారాయణ, బండారి కరుణాకర్, సాంబ శివరావు, కాటం రవీందర్‌తోపాటు వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఆచార్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శి తీరుపై వార్డు సభ్యుల ఆగ్రహం.. సాధారణ సమావేశం బహిష్కరణ

ముస్తాబాద్: నవంబర్ 12(ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్, కార్యదర్శి వ్యవహారశైలికి నిరసనగా పాలకవర్గంలోని వార్డు సభ్యులు సాధారణ సమావేశాన్ని బహిష్కరించి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఎంపీడీవో



వచ్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేస్తూ కార్యాలయం ఎదుటే ఆందోళన కొనసాగించారు.
ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ.. గతంలో గ్రామపంచాయతీ సాధారణ సమావేశాల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేసిన ప్పటికీ ఇప్పటివరకు వాటి అమలులో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని తీర్మానించినా పనులు ప్రారంభించలేదని, ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్లకు మోటార్లు బిగించకపోవ డంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పాలకవర్గ సభ్యుల అభిప్రాయాలకు, తీర్మానాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, గ్రామ సమస్యలను పరిష్కరించే వరకు తమ నిరసన కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసనలో ఉపసర్పంచ్ తల్లా విజయ్ రెడ్డితో పాటు వార్డు సభ్యులు సంజీవ్, రవి, శ్రీనివాస్ గౌడ్, గొండయ్య, మణెమ్మ, రజిని, సుమలత, పద్మ, సంతోషి, సంధ్య, రాజలింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల్లో పారదర్శకత పాటించాలి

భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబర్ 12, ప్రజాజ్యోతి:
జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పారద




ర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్గటూరు మండలం జగదేవ్‌పేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, భూ రికార్డుల వివరాలు, సర్వే నిర్వహణ విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల హద్దులు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. రీ సర్వే సమయంలో రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ, సర్వే శాఖల అధికారు లకు సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జగదేవ్‌పేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని లబ్ధిదా రులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన సహాయ సహకారాలను సకాలంలో అందించాలని, నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవా లని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఏడీ, ఎంపీఓ, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

ప్రభుత్వానికి సర్పంచుల విజ్ఞప్తి

ముస్తాబాద్: నవంబర్ 12(ప్రజా జ్యోతి):
రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వివిధ గ్రామాల సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముస్తాబాద్ మండల తహసీల్దార్ ఎం.డి. ఫారుక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు దాటుతున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటున్నార ని తెలిపారు. గతంలో



కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.
అదేవిధంగా ఎండిన ధాన్యంలో తేమ శాతం 11 నుంచి 12 వరకు ఉండటంతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ముఖ్యంగా సన్న వడ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందించాలని విజ్ఞప్తి చేశారు.రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐకి వినతిపత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, బంధనకల్ సర్పంచ్ చిగురు నరేష్, చిక్కోడు సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, గన్నెవారిపల్లి సర్పంచ్ రఘు, దోనుకుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

బండి సంజయ్ పాదయాత్రను విజయవంతం చేయాలని నాయకులకు దిశానిర్దేశం

ముస్తాబాద్: నవంబర్ 12(ప్రజా జ్యోతి):
భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రోజున ఆయన అధ్యక్షతన ముస్తాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాబోయే కార్యక్రమాల్లో కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచడంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఈ నెల 18వ తేదీన కరీంనగర్‌లో బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ పాదయాత్రను



కుమార్ నిర్వహించనున్న విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రలో పాల్గొనాలని, కార్యక్రమ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశా నికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ హాజరై పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, సీనియర్ నాయకులు కరెడ్ల మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బుచ్చెల్లి మహేశ్వర్, మండల ఉపాధ్యక్షులు గుండవేణి తిరుపతి, కోశాధికారి జిల్లెళ్ల మల్లేశం, శ్రీనివాస్ రావు, బెదుర ప్రశాంత్, బాధ నరేష్, కట్కం మహేష్, మెంగని మహేందర్, ధీటి సత్తయ్య, పెద్దూరి శ్రావణ్, పూనమ్ అనిల్, ప్రభాకర్ రెడ్డి, పల్లటి మల్లేశం, అనిల్, కట్ల అజయ్, పెంటం నరేష్, యాదగిరి, పిట్ల ఎల్లంతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నేలకొండపల్లి, నవంబర్ 12 ప్రజా జ్యోతి: భవిత కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రం ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...దివ్యాంగులకు విద్యా భోదన తో పాటు, ఫిజియోథెరపీ చేసేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు, వైద్యాధికారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిత కేంద్రాలకు ప్రతీ గ్రామం నుంచి దివ్యాంగులు వచ్చేలా అవసరమైతే రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దివ్యాంగుల కు పెన్షన్స్ రానట్లయితే వారిని గుర్తించి పెన్షన్ అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో . తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపగాని రమేష్. పలువురు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణంలో తనిఖీ గత
3 నెలల సన్న బియ్యం స్టాక్‌లో 76.76 క్వింటాళ్ల కొరత

★ డీలర్‌పై 6ఎ కేసు నమోదు ★ జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి సాధారణ తనిఖీలలో భాగంగా,జిల్లాలోని కామేపల్లి మండలం, గరిడేపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం నెం. 2223009 ను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు . తనిఖీ సమయంలో చౌక దుకాణంలోని స్టాక్ రికార్డులను, భౌతికంగా ఉన్న నిల్వలతో సరిపోల్చి చూడగా, గత మూడు నెలల సన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ఉండవలసిన 76.76 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు.పేద ప్రజలకు అందవలసిన సన్న బియ్యంను అక్రమంగా అమ్ముకున్న సదరు డీలర్‌పై శాఖపరంగాను, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ఉ పేక్షించేది లేదని, లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు.

తిరుమలాపురంలో భూ రీసర్వే ప్రారంభం



నేలకొండపల్లి, నవంబర్ 12 ప్రజా జ్యోతి: మండలం లోని తిరుమలాపురం గ్రామంలో గురువారం ప్రారంభించారు. మండలం లోని మొదటి విడతలోఎంపిక చేసిన గ్రామాలలో కొంగర, చందాపురం గ్రామాలు పూర్తి కాగా.. మూడో గ్రామం తిరుమలాపురం లో సర్వే ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, పట్టా భూములు, దేవాలయం భూములను 'గుర్తించి సర్వేయర్ హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామంలో 640 ఎకరాలకు గాను. 265 సర్వే నెంబర్లు ఉన్నాయి. మొత్తం 439 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. తొలి రోజు 20 ఎకరాలను సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమదన ప్రవీణ్, సర్వేయర్ ఉ మామహేశ్వరరావు, జీపీవో లు జానిమియా. రామకృష్ణ, శ్రీను, అశోక్, స్థానిక రైతులు ఏటుకూరి రామారావు. చెరువు నరసింహారావు. ప్రకాష్తోవు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న బోరుకు పునర్జీవం

★ నీటి కొరత నివారణకు ముందడుగు ★ సర్పంచ్ మేదర టోని



కారేపల్లి, నవంబర్ 12, ప్రజా జ్యోతి: సింగరేణి మండల కేంద్రంలో ప్రస్తుతం నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డోర్నకల్ బైపాస్ రోడ్డులోని రైస్ మిల్లు సమీపంలో ఎన్నో సంవత్సరాలుగా వాడకంలో లేక నిరుపయోగంగా ఉన్న బోరును గుర్తించి, గురువారం దానికి అవసరమైన మరమ్మతులు సర్పంచ్ మేదరటోని ఆధ్వర్యంలో పాలకమండలి కృషితో చేయించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీటి కొరత సమయంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ఎంతో అవసరమని భావించి ఈ చర్య చేపట్టడం జరిగింది. ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం మాత్రమే కాకుండా, ముందుగానే తగిన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డ్ మెంబర్ ఆదర్ల అంజయ్య, సెక్రటరీ నెహ్రూ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

★ ఆవిష్కరించిన మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్య



బోనకల్, నవంబర్ 12(ప్రజా జ్యోతి): టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా విద్యా మహాసభలు ఈనెల 15 ,16 తేదీలలో ముదిగొండ మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్ లో జరుగ బోతున్నాయి. ఇట్టి మహాసభల పోస్టర్లను గురువారం బోనకల్ మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంఘ మహాసభల సందర్భంగా ప్రభుత్వ విద్యారంగా పరీక్షణకై మేధావులతో సెమినార్లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ మాట్లాడుతూ... రాజ్యాంగ సర్ పై ప్రముఖ విద్యావేత్త కె ఎస్ లక్ష్మణరావు, విద్యారంగం ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వ వైఖరిపై రాష్ట్ర అధ్యక్షులు చావరవి ప్రసంగించనున్నారు. ఈ మహాసభల్లో మొదటి రోజు గొప్ప ర్యాలీ కూడా ఉంటుందని ఉ పాధ్యాయులందరికీ ర్యాలీలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉ పాధ్యక్షులు పి. గోపాలరావు, మండల కోశాధికారి పి నరసింహ రావు, మండల ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ జల్లా కోటయ్య, మండల ఆడిటర్ నరేంద్రసింహ, కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, ఉ పాధ్యాయులు గౌసుద్దీన్, సత్యానందం, లిడియా, సరస్వతి, జ్యోతి, మంగతాయారు, పి. రవి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 20- 21 తేదీలలో
జిల్లా స్థాయి పాఠశాలల కబడ్డీ టోర్నమెంట్

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి..జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మామునూరు పాఠశాలలో, ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ 17 సంవత్సరాల విభాగం బాల-బాలిక కబడ్డీ టోర్నమెంట్ జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి బి.మురళి మోహన్ రావు, గురువారం తెలిపారు. సందర్భంగా మండలంలోని ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మామునూరు స్కూలు వేదికగా కానున్నదని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 21 మండలాలకు సంబంధించిన క్రీడాకారులు రెండు రోజులు పాటు క్రీడల్లో పాల్గొంటారు. మొదటిరోజు బాలికలు రెండవ రోజు బాలురు. కబడ్డీ లో పాల్గొంటారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మురళి మోహన్ రావు, మండల సెక్రెటరీ మారాబత్తుల జమలయ్య, సత్యనారాయణ రెడ్డి, సాంబశివారెడ్డి, నాగేశ్వరరావు, అజీమ్, గోపిరెడ్డి,,వేణు,జహీరా, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో విచ్చలవిడిగా కల్తీ పాల దందా...!


★ పాలా..? విషమా..? ప్రజల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం...

★ నీళ్లు, పౌడర్‌తో పాలు.. తాగేది పాలో.. రసాయనమో..?

★ టీ షాపుల్లో కల్తీ టీ.. పట్టించుకోని అధికారులు...

★ కల్తీ పాలకు బలవుతున్న ప్రజారోగ్యం...

★ తనిఖీలు లేవు.. భయం లేదు.. మణుగూరులో కల్తీ రాజ్యం...





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. మణుగూరు. నవంబర్ 12, ప్రజాజ్యోతి.. పూర్వం ప్రతి ఇంటి ముందు ఆవు అంబా అంటూ పలకరించేది. వేకువజామున గేదె పాలు పితికి ఇంటింటికీ తిరిగే ఇచ్చే వారిపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉండేది. కానీ కాలం మారింది.. ఆ నమ్మకం స్థానంలో ఇప్పుడు ప్యాకెట్టు వచ్చి చేరింది. తెల్లవారగానే దుకాణాల ముందు పేరుకుపోతున్న ప్యాకెట్లను చూసి జనం ఇదే శ్రేష్ఠమని భావిస్తున్నారు. కానీ ఆ ప్యాకెట్టు లోపల ఏముందో తెలుసుకునే ప్రయత్నం ఎవరూ చేయలేకపోతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి ఉదయం అదే ప్యాకెట్టుతో మొదలవుతోంది. చాయ్ దుకాణాల్లో కుండలో మరిగే ద్రవం చూసి జనం దానిని క్షీరమని నమ్ముతున్నారు. వాస్తవం ఏమిటో తెలిస్తే ఆ నమ్మకం బద్దలవుతుందని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు.

కల్తీ పాలు.. ప్రజల ప్రాణాలకే ముప్పు...

మణుగూరు పట్టణంలో ప్రతి రోజు ఇళ్లకు చేరే పాలు స్వచ్ఛమైనవి కావన్న అనుమానం ఇప్పుడు బలంగా బలపడుతోంది. పాడి రైతుల వద్ద నుంచి వచ్చే అసలు పాలకు నీటిని కలిపి పరిమాణం పెంచుతున్నారని ఆరోపణలు కూడా వస్తున్నాయి. పాలు మందంగా కనిపించేందుకు పాల పొడి, ఇతర తెల్లని పదార్థాలు కలుపుతున్నారని తెలుస్తోంది. పాలను మరిగించినప్పుడు వస్తున్న వింత వాసన, అడుగున పేరుకుంటున్న మడ్డి ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆంధ్ర నుంచి

మణుగూరు పట్టణంలో కల్తీ పాల వ్యవహారం కలకలం రేపుతోంది. స్వచ్ఛమైన పాల పేరిట జరుగుతున్న మోసం వెలుగుచూస్తోంది. ఐదు లీటర్ల పాలను నీరు పోసి పదిహేను లీటర్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలు చిక్కగా, తెల్లగా కనిపించేందుకు పౌడర్, పొడి పదార్థాలు కలుపుతున్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి తరలివస్తున్న పాల ప్యాకెట్ల నాణ్యతపై కూడా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, చాయ్ దుకాణాల్లో ఇదే పాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కల్తీ పాల సేవనంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వచ్చే పాల ప్యాకెట్లలో కూడా ఇదే తంతు సాగుతోందని స్థానికులు వాపోతున్నారు. చిన్న పిల్లలు తాగే పాలలో కూడా కల్తీ జరుగుతుండటం అందరినీ కలవరపెడుతోంది. పాల కోసం ఖర్చు పెడుతున్న డబ్బుకు సరైన పాలు అందడం లేదని కొందరు గృహిణులు వాపోతున్నారు. ఈ కల్తీ పాల వల్ల కడుపు నొప్పి, విరేచనాలు, జ్వరం వంటి రోగాలు పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పాల నమూనాలను పరీక్షించి నిజం తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాలలో నీళ్లు, పౌడర్.. తాగుతున్నది పాలా..? కల్తీనా..?

పాల వ్యాపారంలో కొందరు పాలకు నీటిని కలపడాన్ని ఒక పద్ధతిగా మార్చుకున్నారని ప్రజల నుంచి గట్టిగా వినపడుతోంది. ఒక 10 లీటర్ల పాలకు మరో 20 లీటర్ల నీటిని కలిపి 30 నుంచి 40 లీటర్లుగా అమ్ముతున్నారన్న మాట మార్కెట్ లో వినిపిస్తోంది. నీళు కలిపిన పాలు పల్చగా ఉంటాయని తెలియకుండా ఉండేందుకు పాల పొడి, పౌడర్ ని కలుపుతున్నారని స్థానిక జానానికి తెలిసిపోయింది. పొడి కలపడం వల్ల పాలు తెల్లగా, చిక్కగా కనిపించి జనం నమ్ముతున్నారని పలువురు అనకోస్తున్నారు. ఇంట్లో పాలు విరిగిపోవడం, పెరుగు సరిగా తోడుకోకపోవడం కూడా కల్తీకే నిదర్శనమని కొందరు మహిళలు చెబుతున్నారు. పిల్లలకు తాగించే పాలలో ఇలా చేయడం దారుణమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాల ను కొనేటప్పుడు వాసన చూసి, రుచి చూసి కొనాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

తనిఖీలు చేయండి.. పాల నమూనాలు పరీక్షించండి..

పాలలో కల్తీ జరుగుతున్నా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట దుకాణాలకు వచ్చే పాల వాహనాలను ఎవరూ తనిఖీ చేయడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. ప్రతి దుకాణం నుంచి పాల నమూనాలు తీసి ప్రయోగశాలకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. పాలలో నీరు, పౌడర్, రసాయనాలు ఎంత ఉన్నాయా అనేది పరీక్షలోనే తేలుతుందని ఒక పక్క వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో తనిఖీలు లేకపోవడంతో కల్తీ వ్యాపారులకు భయం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఆహార భద్రతా అధికారులు వెంటనే రంగంలోకి దిగాలని, కల్తీ చేసినట్లు తేలిన వారి దుకాణాలను మూసివేసి, లైసెన్సులు రద్దు చేయాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది.

21న ప్రత్యేక లోక్ అదాలత్..!

★ చెక్ బౌన్స్ కేసులకు రాజీ మార్గం..!

★ కోర్టు చుట్టూ తిరగడం ఇక ఆగుతుంది

★ ఇరువర్గాలకు మేలు చేసే సువర్ణావకాశం

★ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 12, ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 21న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రధాన జిల్లా న్యాయమూర్తి ప్రేమలత తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్ లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను రాజీ మార్గంలో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని ఆమె పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు ఈ లోక్ అదాలత్ తో ఉపశమనం లభిస్తుందని ఆమె అన్నారు. ఫిర్యాదిదారుడు, నిందితుడు ఇరువురూ అంగీకరిస్తేనే రాజీ కుదురుతుందని ఆమె స్పష్టం చేశారు. రాజీ కుదిరిన కేసులకు చట్టబద్ధత ఉంటుందని, వాటిపై అప్పీలుకు అవకాశం ఉండదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కోర్టు ఫీజు, న్యాయవాదుల ఖర్చు, కాలయాపన వంటి భారాల నుంచి కక్షిదారులు బయటపడతారని అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లోని చెక్ బౌన్స్ కేసులు ఈ లోక్ అదాలత్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. కేసు ఉన్న వారు తమ న్యాయవాది ద్వారా లేదా నేరుగా సంబంధిత కోర్టులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా పేరు నమోదు చేసుకుంటేనే కేసు లోక్ అదాలత్ లోకి వస్తుందని అధికారులు తెలిపారు. రాజీ కుదరని కేసులు తిరిగి సాధారణ విచారణకు వెళ్తాయని న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ నిర్వహణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు. కక్షిదారులు ఎటువంటి భయం లేకుండా ముందుకు రావాలని ఆమె కోరారు. డబ్బు విషయంలో ఏర్పడిన విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడమే లోక్ అదాలత్ ఉద్దేశమని ఆమె అన్నారు. రాజీతో ఇరువర్గాల మధ్య సంబంధాలు కూడా మెరుగుపడతాయని ఆమె అన్నారు. చెక్ బౌన్స్ కేసులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణమంతా ఉట్టి డోల్లే..!

★ భగత్ సింగ్ నగర్‌లో 2 కోట్ల 28 లక్షల మాయాజాలం..!

★ ట్యాంక్ కట్టేది నీటి కోసమా..? దోపిడీ కోసమా..?

★ 800 కిలో లీటర్ల ట్యాంక్ లో 800 తప్పులు..! ఒక్కటైనా నాణ్యత ఉందా..?

★ కాంట్రాక్టర్‌కు ఎంబీ రికార్డ్ రాస్తే.. అధికారి కూడా దోషే..!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 12, ప్రజాజ్యోతి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం భగత్ సింగ్ నగర్ మున్సిపాలిటీ ఏరియాలో జరుగుతున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణమంతా ఉట్టి డోల్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అమృత్ 2.0 పథకం కింద మణుగూరు పట్టణ మంచినీటి సరఫరా అభివృద్ధి కోసం భగత్ సింగ్ నగర్ నందు 800 కిలో లీటర్ల సామర్థ్యం గల ఎత్తైన మంచినీటి నిల్వ ట్యాంక్ నిర్మాణానికి ప్రభుత్వం ఏకంగా రూ. 2 కోట్ల 28లక్షలు కేటాయించింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత శంఖుస్థాపన చేయించిన ఈ ప్రతిష్టాత్మక పనిలోనే ఇప్పుడు 2 కోట్ల 28 లక్షల మాయాజాలం జరుగుతుందని స్థానికులు, కొందరు ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. శిలఫలకం బోర్డు మీద మాత్రం కోట్ల లెక్క చూపించారు. కానీ సైట్ లో జరుగుతున్న పని చూస్తే అదంతా డోల్లే అని అర్థమవుతుందని వాపోతున్నారు.

ట్యాంక్ ప్రజల కోసమా..? కాంట్రాక్టర్ కోసమా..?

ట్యాంక్ కట్టేది ప్రజల నీటి కోసమా..? లేక కాంట్రాక్టర్ దోపిడీ కోసమా..? అన్న అనుమానం ఇప్పుడు మణుగూరులో ప్రతి ఒక్కరి నోట వినిపిస్తోంది. 800 కిలో లీటర్ల నీటిని నిల్వ చేయాల్సిన ట్యాంక్ లో 800 తప్పులు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. పునాది నుంచి స్లాబ్ వరకు ఒక్క చోటైనా నాణ్యత కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. వాడాల్సిన సిమెంట్, ఇసుక, కంకర ఏదీ సరైన నిష్పత్తిలో వాడటం లేదని, కాంక్రీట్ వేసిన మరునటి రోజుకే పగుళ్లు, బీటలు వస్తున్నాయని స్థానిక ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్యూరింగ్ లేదు, పర్యవేక్షణ లేదు, నాణ్యత పరీక్షలు లేవంటున్నారు. ఇలా కట్టిన ట్యాంక్ లో నీళ్లు నింపితే ట్యాంక్ నిలబడుతుందో, కూలిపోతుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రజల తాగునీటి ట్యాంక్ లోనే ఇంత నాసిరకం జరుగుతుంటే, ఇక వేరే పనుల్లో ఇంకెంత జరుగుతుందోనని ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నాసిరకం పనికి ఎంబీ రికార్డు, బిల్లులేందుకు..

మొత్తం దోపిడీ వెనుక కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని విమర్శలు జోరుగా వస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు సైట్ వైపు కూడా రావడం లేదని, దీంతో కాంట్రాక్టర్ ఆడిందే ఆటగా.. పాడిందే పాట గా మారిందని తెలుస్తోంది. ఈ నాసిరకం పనికి కాంట్రాక్టర్ కు ఎంబీ రికార్డు, బిల్లులు చేయకుండా వెంటనే ఆపేయాలని, పూర్తి విచారణ జరిగే వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయవద్దని స్థానికులతో పాటు నాయకులు కోరుతున్నారు. ఒకవేళ ఈ పనికి ఎంబీ రాస్తే ఆ అధికారి కూడా దోషే అవుతాడని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంక్ నిర్మాణ పనులను పూర్తిగా పరిశీలించి నాసిరకంగా నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకొని కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

కరువు రైతులకు రుణ ఉపశమనం కల్పించాలి

- ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలి - బ్యాంకర్ల ను ఆదేశించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక ఉపశమన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్





దీపక్ తివారీ బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపుల గడువు పొడిగింపు వంటి వెసులుబాట్లు కల్పించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో బ్యాంకుల పనితీరు, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయ రుణాల పంపిణీ, ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరు, కరువు ప్రభావిత రైతులకు అందించాల్సిన ఆర్థిక ఉపశమన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాలోని 20 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అర్హులైన రైతుల రుణ ఖాతాలను పరిశీలించి, అవసరమైన రుణ పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపుల గడువు పొడిగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ఆర్థిక పరిస్థితి, పంట నష్టం, తిరిగి రుణాలు చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేసి అర్హులకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. పంట రుణాలతో పాటు వ్యవసాయ పెట్టుబడి రుణాలు, పశుపోషణ, ఇతర అనుబంధ రంగాలకు సంబంధించిన రుణాలపైనా అవసరమైన ఉపశమన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రుణ పునర్వ్యవస్థీకరణపై రైతులకు అవగాహన కల్పించాలి : రుణ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రుణ ఉపశమన చర్యల్లో బీమా పరిహారం, ప్రభుత్వ ఆర్థిక సహాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులకు వడ్డీ రాయితీలు, సకాలంలో రుణ చెల్లింపుల ప్రోత్సాహక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన రుణ ఖాతాలను గుర్తించి, నిర్ణీత గడువులో ఉపశమన చర్యలు అమలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి కరువు ప్రభావిత రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డేవిడ్ విల్సన్, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, పరిశ్రమల అధికారి శివకుమార్, రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఏజీఎం ఉదయ్ కిరణ్, కెనరా బ్యాంక్, యూబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా సమన్వయకర్తలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు 'షీ బాక్స్'లు..

మహిళలు, బాలికలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు జిల్లాలో 200 షీ బాక్స్‌ల ఏర్పాటు..

ప్రతి శనివారం తప్పనిసరిగా షీ బాక్స్‌లను తెరిచి ఫిర్యాదులను సేకరించాలి..

ఫిర్యాదులు, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచాలి - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్..

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న వేధింపులు, ఇతర సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో షీ బాక్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ





పాఠశాలలు, కళాశాలలు, మహిళా వసతి గృహాలు, బస్టాండ్లు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మొత్తం 200 షీ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ ఫిర్యాదులను అందించేందుకు వీలుగా, సీసీ కెమెరాల నిఘా లేని, పురుషుల రాకపోకలు తక్కువగా ఉండే గోప్యత కలిగిన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన షీ బాక్స్‌ల నిర్వహణ బాధ్యతను మహిళా పోలీసు అధికారికి అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రతి శనివారం తప్పనిసరిగా షీ బాక్స్‌లను తెరిచి ఫిర్యాదులను సేకరించి, అదే రోజు సాయంత్రంలోగా షీ టీమ్స్ ఇన్‌చార్జి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేయాలని ఆదేశించారు. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో రిజిస్టర్‌లో నమోదు చేసి, షీ టీమ్స్ ఎస్ఐ ద్వారా సంబంధిత షీ టీమ్స్ సిబ్బందికి కేటాయించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై వారం రోజుల్లోగా విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సంప్రదింపు వివరాలు అందించినట్లయితే, వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ వారిని సంప్రదించి, సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల్లో షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, షీ బాక్స్‌ల వినియోగం, వాటి ద్వారా ఫిర్యాదు చేసే విధానంపై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ బాక్స్‌ల ద్వారా ఈవ్ టీజింగ్, మహిళలపై వేధింపులు, వెంటపడటం, సైబర్ వేధింపులు, గృహహింస తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలియజేయాలని అన్నారు. షీ బాక్స్‌ల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం ప్రతి మహిళ, బాలిక తన సమస్యను ఎలాంటి భయం లేకుండా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి, న్యాయం పొందగలమనే నమ్మకాన్ని కల్పించడమేనని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

పత్తి చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు

రాయికోడ్ నవంబర్ 12(ప్రజా జ్యోతి): పత్తి సీజన్ నేపథ్యంలో మండలంలోని రైతులు తమ పంటకు తగిన భద్రత కల్పించుకోవాలని ఎస్‌హెచ్ఓ చైతన్య కిరణ్ సూచించారు.పొలాల్లో నిల్వ ఉంచిన పత్తి,పత్తి బస్తాల చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పత్తి చోరీలకు పాల్పడినా,చోరీ పత్తిని కొనుగోలు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్..

మొదటిపేజీ తరువాయి..

నియమించిన ప్రభుత్వం, అదనంగా డీజీపీ ఆర్గనైజేషన్, లీగల్ బాధ్యతలను అప్పగించింది. స్వాతిలక్రాను జైళ్ల శాఖ డీజీపీగా బదిలీ చేసి, హోంగార్డ్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు. చారు సిన్హాకు ఏసీబీ డీజీగా నియామకంతోపాటు సీఐడీ డీజీ బాధ్యతలు అప్పగించింది. అనిల్‌కుమార్‌ను తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటి వరకు ఆర్టీసీ బాధ్యతలు చూసిన వై.నాగిరెడ్డిని పౌరసరఫరాల కమిషనర్‌గా నియమించింది. సంజయ్‌కుమార్ జైన్‌కు డీజీపీ ట్రైనింగ్ అదనపు బాధ్యతలు ఇచ్చింది. విక్రమ్‌సింగ్ మాన్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్)గా నియమించింది. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేసింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఉన్న జోయల్ డేవిస్‌కు టీజీ-టీమార్స్ (రోడ్ సేఫ్టీ) జాయింట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీ బాలాదేవిని టీజీ-టీమార్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమించింది. అకున్ సబర్వాల్‌ను అదనపు డీజీపీ లా అండ్ ఆర్డర్‌గా, ఎస్.చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. కార్తికేయను ఐజీపీ మల్టీ జోన్-1గా బదిలీ చేసి, ఐసీసీసీ డైరెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించింది. కె.రమేశ్ నాయుడును రైల్వే ఐజీగా నియమించింది. చందన దీప్తికి జోగులాంబ రేంజ్ డీఐజీ, ఆర్. భాస్కరన్‌కు ఇంటిలిజెన్స్ డీఐజీగా నియమించింది. కె. నారాయణ నాయక్‌కు బాసర్ డిఐజి గా, ఎల్.ఎస్. చౌహాన్‌కు చార్మినార్ డీఐజీతో పాటు కోఆర్డినేషన్ బాధ్యతలు అప్పగించింది. అరవింద్ బాబును హైదరాబాద్ సిటీ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు ప్రజల భద్రతకు ప్రాధాన్యం.. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు.. డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం.. ఆహార కల్తీపై దాడులు.. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు.. ఇలా హైదరాబాద్ నగరంలో అనేక అంశాలపై దృష్టి సారించిన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టుండి బదిలీ చేసింది. 2025 సెప్టెంబర్ 30న హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఏడాది కూడా పూర్తికాకముందే కొత్త పోస్టింగ్ ఇచ్చింది. 2026 నవంబర్ 12న అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర, పౌర రక్షణ విభాగం డీజీగా నియమించింది. అయితే ప్రజల సమస్యలపై చురుగ్గా స్పందిస్తున్న అధికారిని బదిలీ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకు వచ్చింది? అనే ప్రశ్న ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. హైదరాబాద్ సీపీగా సజ్జనార్ ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యమిచ్చారు. ఆహార కల్తీ ముఠాలపై ప్రత్యేక తనిఖీలు, డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు, విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. హెచ్-న్యూ విభాగాన్ని బలోపేతం చేస్తూ ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం పెంచే ప్రయత్నం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. మహిళల గోప్యతకు భంగం కలగకుండా షీ నేత్ర బృందాలు, వేధింపుల నియంత్రణకు షీ టీమ్స్, బాధితులకు భరోసా కేంద్రాల సేవలకు ప్రాధాన్యమిచ్చారు. ఇన్ని కార్యక్రమాలు కొనసాగుతున్న సమయంలో ఆయనను బదిలీ చేయడం వెనుక కారణాలేమిటన్నది ప్రజలకు సహజంగానే సందేహం కలిగిస్తోంది.1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సజ్జనార్‌కు సుదీర్ఘ అనుభవం ఉంది. నల్లగొండ, కడప, గుంటూరు, వరంగల్, మెదక్ జిల్లాల ఎస్పీగా పనిచేశారు. సైబరాబాద్ సీపీగా ఉన్న సమయంలో సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

వ్యవసాయ ఆధునీకరణతోనే

'వికసిత్ భారత్'



మొదటిపేజీ తరువాయి..

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. "ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?" అని ప్రధాని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. "మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు" అని ఆయన గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. "ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం" అని తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. "సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని పేర్కొన్నారు. భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. "21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది. నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది" అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛట్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

గత దశాబ్ద కాలంలో పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య రంగం, తేనెటీగల పెంపకం, ఉద్యానవన రంగం వంటి అనుబంధ వ్యవసాయ రంగాల్లో సాధించిన వృద్ధిని కూడా ప్రధాని మోదీ వివరించారు. "గత పదేళ్లలో భారతదేశంలో పాల ఉత్పత్తి దాదాపు 70 శాతం పెరిగింది. గుడ్ల ఉత్పత్తి 90 శాతం వృద్ధి చెందింది. అలాగే, మత్స్య ఉత్పత్తి రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 'స్వీట్ రివల్యూషన్' తేనెటీగల పెంపకంలో కొత్త అవకాశాలను కల్పించింది. తేనె ఉత్పత్తి 80,000 టన్నుల నుంచి 1,50,000 టన్నులకు పెరిగింది" అని మోదీ పేర్కొన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడి చమురు ధరల గురించి మోదీ గుర్తు చేసుకున్నారు. "పశ్చిమాసియాలో యుద్ధ ముప్పు పొంచి ఉన్నప్పుడు, ముడి చమురు ధరలు కొన్ని వారాల వ్యవధిలోనే బారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగాయి. అప్పట్లో భారత్ ఒక పెద్ద సవాలును ఎదుర్కొంది. డీజిల్ ధరను లీటరుకు కనీసం రూ.50 మేర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ క్లిష్ట సమయంలో, ప్రభుత్వం మన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒక నిర్ణయం తీసుకుంది. రూ.50 పెంపునకు బదులుగా, ప్రభుత్వం డీజిల్ ధరను లీటరుకు కేవలం 7 రూపాయలు మాత్రమే పెంచి, మిగిలిన 43 రూపాయల భారాన్ని భరించింది. మన పొరుగు దేశాల్లో చాలా చోట్ల డీజిల్ ధరలు 40 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగాయి. కానీ భారత్‌లో అలా జరగలేదు. అప్పటి నుండి, ప్రభుత్వం ప్రతి నెలా రూ.14,000 కోట్ల నష్టాన్ని భరిస్తూ వస్తోంది" అని మోదీ పేర్కొన్నారు.

డిసెంబర్ నాటికి ఉస్మానియా

ఆస్పత్రి పూర్తి

మొదటిపేజీ తరువాయి..

ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని తెలిపారు. నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా



వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు ఎక్కువ సమయం పడుతున్నందున సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిమ్స్‌లో పడకలు లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్‌నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సూచించారు. టిమ్స్‌లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఏఐ పర్యవేక్షణతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్ల (ఓపీ) సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్‌పేషెంట్ల (ఐపీ) సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూడేళ్లలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ రాజీనామా

మొదటిపేజీ తరువాయి..

ఆయన రాజీనామా చేయగా.. తక్షణమే ఇది అమల్లోకి వచ్చింది. జెన్సెన్ స్థానంలో తాత్కాలిక సీఈఓగా చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) కొలెట్టె క్రెస్ బాధ్యతలు చేపట్టారు. ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్, సింగపూర్ సంస్థ మెగాస్పీడ్ ఇంటర్నేషన్ ఎగ్జిక్యూటివ్ చైనా పౌరులు ఆలిస్ హువాంగ్ మధ్య సన్నిహిత సంబంధం ఉందని న్యూయార్క్ టైమ్స్ గత నెల కథనం ప్రచురించింది. ఆమె నేరుగా బీజింగ్‌కు గూఢచార సమాచారాన్ని చేరవేస్తున్నట్టు అమెరికా నిఘా సంస్థలు గుర్తించాయని నివేదించింది. ఈ వ్యవహారంపై ఎన్విడియా అంతర్గత విచారణకు ఆదేశించిన తరువాత, ఎఫ్‌బీఐ కూడా దర్యాప్తు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ధ్రువీకరించారు.

కాగా, అలీసా తన వివాహేతర సంబంధం గురించి బోర్డు మీటింగులో హువాంగ్ అంగీకరించారని, తన భార్యకు ద్రోహం చేశానని ఆయన ఒప్పుకున్నట్టు నివేదికలు పేర్కొన్నాయి.కంపెనీ శాశ్వత వారసుడి కోసం అన్వేషిస్తుందని, హువాంగ్ బోర్డులో కొనసాగరని ఒక ప్రకటనలో తెలిపింది. చైనా గూఢచారిగా అనుమానిస్తున్న అలీసా హువాంగ్‌తో పాటు తన సంస్థలో పనిచేసే ఒక ఉద్యోగితో ఆయనకు వివాహేతర సంబంధం ఉందని నివేదికలు వచ్చాయి. దీంతో ఎన్విడియా సహ వ్యవస్థాపకుడు, నాల్గో అతిపెద్ద పెట్టుబడిదారు అయిన 63 ఏళ్ల హువాంగ్‌పై ఒత్తిడి పెరుగుతోంది. చివరకు ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా, జెన్సెన్ హువాంగ్ రాజీనామాతో ఎన్విడియా కంపెనీ షేర్లు 13 శాతం మేర పతనమయ్యాయి. ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీలలో ఒకటైన ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ రాజీనామా చేయడంతో, గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో ఆ కంపెనీ షేర్లు కుప్పకూలాయి. స్టాక్ మార్కెట్ ప్రారంభమయ్యే సమయానికి ఎన్విడియా షేర్లు 13.09% తగ్గి, వి150.98 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.ఏఐ పరిశ్రమలో ఒక ప్రధాన నాయకత్వ మార్పును సూచిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఒక ఆధిపత్య శక్తిగా హువాంగ్ తీర్చిదిద్దిన ఈ చిప్‌మేకర్ భవిష్యత్తుపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. జూలై 2025 తర్వాత మొదటిసారిగా ఎన్విడియా మార్కెట్ విలువను 4 ట్రిలియన్ల కంటే దిగువకు పడిపోవడం ఇదే మొదటిసారి. సీఎఫ్ఓ కొలెట్ క్రెస్ తాత్కాలిక సీఈఓగా, ఎన్విడియా, సైనోపిసిస్ మాజీ సీఈఓ, బోర్డు సభ్యుడు హార్వే జోన్స్‌ను కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా కూడా నియమించింది.

మరోవైపు ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హువాంగ్ స్థానంలో యాపిల్ సీఈఓ టిమ్ కుక్ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. "అద్భుతమైన పనితీరు కనబరిచిన ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ఇప్పుడు రాజీనామా చేయడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేయగల ఏకైక వ్యక్తి యాపిల్ కు చెందిన టిమ్ కుక్. ఒక దిగ్గజం స్థానంలో మరో దిగ్గజం! అధ్యక్షుడు డొనాల్డ్ జె. ట్రంప్" అని పోస్ట్ పెట్టారు. క్యుపెర్టినో కేంద్రంగా పనిచేసే యాపిల్ సంస్థకు దశాబ్దానికి పైగా నాయకత్వం వహించిన కుక్.. గత సెప్టెంబర్‌లో సీఈఓ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును ట్రంప్ సూచించారు. కుక్‌తో తనకున్న అనుబంధాన్ని కూడా ట్రంప్ గుర్తు చేసుకుంటూ, ఆయనను 'అద్భుతమైన వ్యక్తి'గా అభివర్ణించారు. తాను మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఒక సమస్య పరిష్కారం కోసం కుక్ తనను ఆశ్రయించినప్పుడు తమ మధ్య వృత్తిపరమైన సంబంధం మొదలైందని ట్రంప్ పేర్కొన్నారు.

త్వరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

రంగం సిద్ధం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

మహిళా రిజర్వేషన్ల అమలుకు కసరత్తు

న్యూఢిల్లీ, నవంబర్ 12(ప్రజాజ్యోతి): పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ బిల్లు కచ్చితంగా 15 నుంచి 18 ఓట్ల మెజారిటీతో నెగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ స్థానాల పెంపునకు రాజ్యాంగ సవరణ జరిగి తీరుతుందనే విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభించాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. లోక్‌సభలో 361 ఓట్లు అవసరం. ప్రస్తుతం 543 స్థానాలున్న లోక్‌సభలో మూడు ఖాళీలు ఉన్నాయి. తమకు అవసరమైన సంఖ్యాబలం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రత్యేక సమావేశాల తేదీలను మాత్రం వెల్లడించలేదు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను ప్రస్తుతమున్న 543 నుంచి గరిష్టంగా 850కి పెంచాలని ఈ సవరణలో ప్రతిపాదించారు. తద్వారా పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన ప్రత్యేక భేటీలో ఇలాంటి రాజ్యాంగ సవరణ బిల్లుకు తగినన్ని ఓట్లు రాకపోవడం వల్ల అది వీగిపోయింది. ఇప్పుడు తాజా ప్రతిపాదనలతో కేంద్రం ముందుకు రానుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, కానీ ఇప్పటివరకు అధికారికంగా ముగియలేదు (ప్రొరోగ్ చేయలేదు). ఇలా సమావేశాలు ప్రొరోగ్ కాకుండా 91 రోజుల పాటు కొనసాగుతుండటం ఇదే తొలిసారి. దీనివల్ల పార్లమెంటును మళ్లీ సమావేశపరిచే అవకాశం ఉంది. 2008లో ఉన్న 87 రోజుల రికార్డును ఇది అధిగమించింది. ఒకవేళ కొత్త సెషన్ ప్రారంభించాలంటే 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. అదే కొనసాగుతున్న సెషన్‌లోనే అదనపు సిట్టింగ్ ఏర్పాటు చేయాలంటే రెండు రోజుల నోటీసు ఇస్తే సరిపోతుంది. అందుకే రాజ్యాంగ సవరణ బిల్లు కోసం వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా ముగించలేదనే వాదన వినిపిస్తోంది. వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించకుండా కొనసాగించడం, ప్రతిపాదిత సవరణను పరిశీలించేందుకు అదనపు లేదా ప్రత్యేక సమావేశాలను నిర్వహించవచ్చనే ఊహాగానాలకు దారితీసింది. 2029 పార్లమెంటు ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే డీలిమిటేషన్ వల్ల తమ ప్రాతినిధ్యం తగ్గుతుందన్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను 50 శాతం మేర పెంచాలని తాజా ముసాయిదాలో ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలన్నీ పరిశీలన దశలోనే ఉన్నాయని, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967